పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# పారిశ్రామిక రంగంలో తెలంగాణ దూసుకెళ్తోంది

- మూడేళ్లలో పెరిగిన కర్మాగారాల సంఖ్య
- ఏడాదిలో కొత్తగా 75 వేల మందికి ఉపాధి
- జాతీయ పారిశ్రామిక వార్షిక నివేదిక-2024-25లో వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ పారిశ్రామిక రంగం ఉత్పత్తి, ఉపాధి, లాభదాయకతలో జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి సాధించినట్లు జాతీయ పారిశ్రామిక వార్షిక నివేదిక–2024–25 వెల్లడించింది. రాష్ట్రంలోని 13,937 కర్మాగారాల్లో దాదాపు 9.87 లక్షల మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు.గత ఏడాది కాలంలోనే పారిశ్రామిక సంస్థల్లో కొత్తగా 75,374 మందికి ఉద్యోగాలు లభించాయి. కర్మాగారాల సంఖ్యలో తెలంగాణ 5.22 శాతం వాటాతో దేశంలో ఏడో స్థానంలో ఉంది.రాష్ట్రంలో రూ.3.62 లక్షల కోట్ల పెట్టుబడితో రూ.4.57 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి సాధించినట్లు నివేదిక తెలిపింది. పరిశ్రమల ఉత్పత్తి విలువ రూపాయికి రూ.1.26గా ఉండగా.. జాతీయ సగటు రూ.1.19గా ఉంది.పారిశ్రామిక రంగంలో తెలంగాణ లాభదాయకత 8.92 శాతంగా నమోదైంది. ఇది జాతీయ సగటు 6.99 శాతం కంటే ఎక్కువ. అలాగే 2024–25లో పారిశ్రామిక సంస్థలు సామాజిక భద్రత కోసం రూ.3,318.23 కోట్లు ఖర్చు చేసినట్లు నివేదిక పేర్కొంది.



# బాపూఘాట్ వద్ద మహాత్ముడికి గవర్నర్, సీఎంల నివాళి



**హైదరాబాద్ పెన్ పవర్:** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్‌లు నివాళులర్పించారు. అనంతరం బాపూఘాట్‌లో మహాత్మాగాంధీ డిజిటల్ మ్యూజియంను గవర్నర్, సీఎంలు ప్రారంభించారు. సుందరీకరణ చేపట్టిన పిన్నమనేని రాజశ్రీని అభినందించారు. అనంతరం వారు గాంధీ మ్యూజియం హాల్‌లో ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థనలకు హాజరయ్యారు. కార్యక్రమంలో సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ప్లానింగ్ బోర్డ్ వైస్‌ఛైర్మన్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, రామచంద్ర నాయక్, ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు, హర్కర వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకల్ని శుక్రవారం గాంధీభవన్‌లో నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్ తదితరులు గాంధీ, శాస్త్రి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలిచి తీరాలి

## ఖైరతాబాద్ ఉప ఎన్నిక కీలకమని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** రానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక పార్టీకి అత్యంత కీలకమని.. గెలిచి తీరాల్సిందేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భాజపా శ్రేణులకు స్పష్టం చేశారు. దీనికి గాను బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నేతలందరూ ప్రజాక్షేత్రంలోనే పని చేయాలని సూచించారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యువతను మత్తు పదార్థాల నుంచి కాపాడేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని కోరారు. కేంద్ర మంత్రి అమిత్ షా ఈ నెల 4న బేగంపేట ఎయిర్‌పోర్టుకు రానున్నారని, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలకాలని కోరారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు మాట్లాడారు.

**మచ్చర్ ధైర్య సాహసాలపై కాంగ్రెస్ స్పందించకపోవడం బాధాకరం**

: ప్రపంచ దేశాధినేతలంతా పైలట్ స్మిత్ మచ్చర్ ధైర్య సాహసాలను అభినందిస్తుంటే.. ఇప్పటివరకు కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం స్పందించకపోవడం ఆశ్చర్యకరమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక భారతీయుడు చూపిన పోరాట పటిమను కనీసం సోషల్ మీడియాలో కూడా పంచుకోకపోవడం బాధాకరమని శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు.

# గాంధీజీ సత్యాగ్రహ పంథా నేటి యువతరానికి ఆచరణీయం:కేసీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజాస్వామిక హక్కుల సాధన కోసం గాంధీజీ అనుసరించిన సత్యాగ్రహ పంథా నేటి యువతరానికి ఆచరణీయమని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయనొక ప్రకటనలో నివాళులర్పిస్తూ..ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'సహనంతో కూడిన ప్రజాస్వామిక పోరాటాల ద్వారా సామాజిక మార్పు సాధించడమే గాంధీజీ ఆశయం. విద్వేషపూరిత పాలనా పద్ధతులను విడనాడి శాంతి సౌభ్రాతృత్వాలను నెలకొల్పడమే గాంధీజీకి మనం అందించే ఘన నివాళి. గాంధీ అనుసరించిన ప్రజాస్వామిక శాంతియుత పోరాట కార్యాచరణ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో స్ఫూర్తిగా నిలిచింది' అని కేసీఆర్ పేర్కొన్నారు.

# నేను ఎమ్మెల్సీ పోటీలోనే ఉన్నా: సర్వోత్తమ్‌రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** 'నల్గొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నేను పోటీలో ఉన్నా. నేను తప్పుకొంటున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు' అని ఆర్.సర్వోత్తమ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఆయన అభ్యర్థిత్వం పట్ల అసంతృప్తితో ఉన్న ఓ మంత్రి ఆయణ్ని బరి నుంచి తప్పుకొనేలా ప్రయత్నం చేసినట్లు తెలిసింది. గురు, శుక్రవారాల్లో ఈ ప్రయత్నం జరిగినా పోటీలో ఉండటానికే సర్వోత్తమ్‌రెడ్డి నిశ్చయించుకొన్నారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో 'ఎన్నికల్లో పోటీ చేయడం నా స్పష్టమైన నిర్ణయం. కాంగ్రెస్ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొంటా' అని ఆయన స్పష్టం చేశారు.



# కాంగ్రెస్, భారాస మధ్య క్విడ్ ప్రోకో

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష పార్టీ భారాస మధ్య పరస్పర అవినీతి బాగోతాలను కప్పిపుచ్చుకునే 'క్విడ్ ప్రోకో' నడుస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. శుక్రవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్, భారాస నేతలు అవినీతిపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారే తప్ప, ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ప్రధాని మోదీ దేశానికి అవినీతి రహిత సుపరిపాలన అందిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎవరు ఎక్కువ అవినీతి చేయాలని పోటీ పడుతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జీవో 317ను భాజపాతో పాటు ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై గాంధీభవన్ ఎదుట న్యాయబద్ధంగా ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయించడాన్ని భాజపా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం' అని రామచందర్‌రావు పేర్కొన్నారు.



-4లో

# జర్నలిస్టుల ఆరోగ్య భద్రతపై.. ప్రభుత్వ నిర్లక్ష్యం ఇంకెన్నాళ్లు..?

- క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అమలు చేయాలని కుత్బుల్లాపూర్‌లో జర్నలిస్టుల గళం..
- పోస్ట్‌కార్డులతో ప్రభుత్వానికి నిరసన తెలిపిన విలేఖరులు..



- జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్..
- షాపూర్‌నగర్‌లో టియుడబ్ల్యూజే హెచ్-143 ఆధ్వర్యంలో నిరసనలు..
- గాంధీ విగ్రహానికి నివాళులు.. అనంతరం వినతిపత్రం సమర్పించిన జర్నలిస్టులు..
- సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్..

# జర్నలిస్టుల ఆరోగ్య భద్రతపై... ప్రభుత్వ నిర్లక్ష్యం ఇంకెన్నాళ్లు..?



కుత్బుల్లాపూర్ జర్నలిస్టులు షాపూర్ నగర్‌లోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత..

- క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అమలు చేయాలని కుత్బుల్లాపూర్‌లో జర్నలిస్టుల గళం..
- పోస్ట్‌కార్డులతో ప్రభుత్వానికి నిరసన తెలిపిన విలేఖరులు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 2:** జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టియుడబ్ల్యూజే హెచ్-143 యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కుత్బుల్లాపూర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు షాపూర్‌నగర్‌లో చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేశారు.. ముందుగా షాపూర్‌నగర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఆ తర్వాత షాపూర్‌నగర్ ప్రధాన పోస్టాఫీస్ కార్యాలయం వద్ద పోస్ట్‌కార్డుల ద్వారా ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు.. జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారి సంక్షేమానికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు..

## జర్నలిస్టుల ఆరోగ్య భద్రతపై తక్షణ చర్యలకు డిమాండ్..

ఈ సందర్భంగా ఐజేయూ (ఇండియన్ జర్నలిస్టు యూనియన్) రాష్ట్ర సభ్యులు రంగు వెంకటేష్ గౌడ్, యూనియన్ జిల్లా అధ్యక్షులు కోల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నప్పటికీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని అన్నారు.. ముఖ్యంగా జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకోవాలని కోరారు.. ప్రభుత్వ ఉద్యోగులకు అందుతున్న తరహాలోనే జర్నలిస్టులకు కూడా క్యాష్‌లెస్ హెల్త్ కార్డుల సౌకర్యాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు..

## నగదు చెల్లింపులు లేని వైద్య సదుపాయం..

అనారోగ్య పరిస్థితుల్లో జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా, గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో నగదు చెల్లింపులు లేకుండా వైద్య సేవలు పొందే విధంగా ఆరోగ్య పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ఇతర సమస్యలపైనా ప్రభుత్వం దృష్టి సారించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యులు శివాజీ, కుత్బుల్లాపూర్ టియుడబ్ల్యూజే హెచ్-143 అధ్యక్షులు సుగ్రీవుడు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి, కోశాధికారి ఎర్రోళ్ల బాబు, టెంజు అధ్యక్షులు ఎర్రోళ్ల కృష్ణ, కుత్బుల్లాపూర్ ఉపాధ్యక్షులు బాన్సువాడ వెంకటేష్, జుట్టు సాయిలు, కార్యదర్శులు ప్రసాద్, యేర్రం శ్రీనివాస్ గుప్తా, జుట్టు యాకుబ్, పల్నాటి శివకుమార్, పాండురంగం తదితరులతో పాటు యూనియన్ సభ్యులు శ్రీరామ రాజు, ఎన్. శివకుమార్, సూర్యచంద్ర, ప్రసాద్, మహేష్, మని ప్రసాద్, కామేష్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు




పోస్ట్ కార్డులను ప్రభుత్వానికి వేరేవిధంగా, హెడ్ పోస్టాఫీసులో పోస్టు బాక్స్‌లో వేసిన జర్నలిస్టులు..

# వ్యవసాయ కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి

- చనిపోయిన వారికి రూ.20 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ కార్యదర్శి నండ్ర ప్రసాద్



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 2 :** ఖమ్మం రూరల్ మండలం కామంచికల్ గ్రామానికి చెందిన పత్తి కూలీలతో జరిగిన ఆటో ప్రమాద ఘటనలో మృతి చెందిన దొంతిసారపు భారతమ్మ కుటుంబాన్ని, గాయాలతో చికిత్స పొందుతున్న కూలీలను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ కార్యదర్శి నండ్ర ప్రసాద్, రూరల్ మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు, రైతు సంఘం కార్యదర్శి ప్రతాపనేని వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ సందర్భంగా నండ్ర ప్రసాద్ మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీ పనుల కోసం వివిధ గ్రామాలకు వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటున్న నిరుపేద కూలీల జీవితాల్లో ఊహించని ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపిందన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన దొంతిసారపు భారతమ్మ కుటుంబ పరిస్థితిని, గాయపడి చికిత్స పొందుతున్న కూలీల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. మృతి చెందిన వ్యవసాయ కూలీ కుటుంబానికి రూ.20 లక్షలు, తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కూలీలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కొడంగల్‌లో సభతో రేవంత్ రెడ్డికి చెమటలు పట్టిస్తాం: తలసాని

- కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ పెడతామన్న తలసాని
- సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్న
- ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు.

ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

## గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళి

**సత్యం.. అహింసే గాంధీజీ చూపిన మార్గం ఎంపీడీవో**



హైదరాబాద్ పెన్ పవర్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏన్కూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యశ్రీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్, మాజీ ఎంపీటీసీ మేడ ధర్మారావు పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ సత్యం, అహింసా సిద్ధాంతాలను ఆయుధాలుగా చేసుకుని దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.దేశ ప్రజల ఐక్యత కోసం గాంధీజీ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏన్కూర్ ప్రెస్ క్లబ్ నిర్వాహకులు, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ ఆశయాలను స్మరించుకుంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

## తపస్ ఆధ్వర్యంలో లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుక



హైదరాబాద్ పెన్ పవర్: తపస్ చేగుంట మండల శాఖ ఆధ్వర్యంలో లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్సు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యోద్యమం లో ప్రముఖ పాత్ర వహించాడు అని, మొదట రైల్వే మంత్రిగా, హోంమంత్రిగా, భారతదేశానికి రెండవ ప్రధానమంత్రిగా పనిచేసే భారతదేశానికి సేవలందించారని, అతను 1965 ఇండో-పాకిస్థాన్ యుద్ధ కాలంలో దేశాన్ని నడిపించిన గొప్ప వ్యక్తి అని, అతని నినాదం "జై జవాన్ జై కిసాన్", యుద్ధ సమయంలో బాగా ప్రాచుర్యంలోనికి తెచ్చి, ప్రజల హృదయాలలో గుర్తుండిపోయిన వ్యక్తి అని, దేశాన్ని రక్షించడానికి జవాన్ ఎంత ముఖ్యమో, భారతదేశానికి అన్నం పెట్టడానికి రైతు అంత ముఖ్యమని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, తపస్ జిల్లా నాయకులు పూల బోయిన దేవానంద్,సుమతి, పట్లూరి యాదగిరి, రమేశ్ పి ఆర్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు చల్లా రామకృష్ణ, బాలు, సి అర్ పి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణి సంరక్షణపై అవగాహన ర్యాలీ




హైదరాబాద్ పెన్ పవర్: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని కొత్తగూడ ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ వరప్రసాద్ రావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగగా, వన్యప్రాణులు, అడవుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. వన్యప్రాణుల సహజ ఆవాసాలను కాపాడటం, అక్రమ వేటను అరికట్టడం, అడవుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెంచడం ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.వన్యప్రాణులకు హాని కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, అడవుల్లో అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణలో అటవీ శాఖతో కలిసి స్థానిక ప్రజలు బాధ్యతాయుతంగా ముందుకు రావాలని కోరారు.

## పోలంపల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాలకు ఘనంగా ఏర్పాట్లు,

**చెరువు కట్ట వద్ద స్థలం చదును గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సన్నాహాలు,**

హైదరాబాద్ పెన్ పవర్: చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో బతుకమ్మ పండుగ సంబరాల కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఆడే స్థలంలో పిచ్చి మొక్కలు, రాళ్లు తొలగించి జెసిబి సహాయంతో చదును చేసే పనులు చేపట్టారు. మహిళలు సురక్షితంగా, సౌకర్యవంతంగా బతుకమ్మ ఆడుకునేందుకు విశాలమైన స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు.

గ్రామ సర్పంచ్ కొండి రాజలక్ష్మి స్వామి, ఉప సర్పంచ్ సత్యగౌడ్, కార్యదర్శి వెంకటేష్, స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. పండుగ రోజు లైటింగ్, మంచినీరు, పారిశుధ్యం వంటి వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.సర్పంచ్ రాజ్యలక్ష్మి స్వామి, మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజ్యలక్ష్మి స్వామి, ఉప సర్పంచ్ సత్య గౌడ్, కార్యదర్శి వెంకటేష్, ఇరిగేషన్ సూపర్వైజర్, యువకులు టప్ప భానుచందర్ నర్సింలు, నరేందర్, సాదు, బాలకృష్ణ, పాల్గొన్నారు,

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

హైదరాబాద్ పెన్ పవర్:




జయంతి వేడుకల్లో పాల్గొన్న వరంగల్ జిల్లా జూనియర్ సివిల్ న్యాయమూర్తి బి.వి.వి.చంద్ర ప్రసన్న, రిటైర్డ్ ప్రొఫెసర్ కె.విజయ బాబు.

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని గొర్రెకుంట, వరంగల్ లోని అనంద ఆశ్రమ నిర్వాహకులు డా.ఈటెల సమ్మయ్య. అధ్యక్షతన ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కుమారి.బోయిడివల్లి వెంకట చంద్రప్రసన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆశ్రమ ప్రాంగణంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం న్యాయమూర్తి చంద్రప్రసన్న మాట్లాడుతూ... గాంధీజీ అహింసా సిద్ధాంతం, సత్య మార్గం నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆశ్రమవాసులతో కాసేపు ముచ్చటించిన ఆమె, వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో వెనుకబడిన, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎటువంటి న్యాయ సహాయానికైననూ న్యాయ సేవాధికర సంస్థలను ఆశ్రయించి న్యాయ సలహాలు, సూచనలు పొందాల్సిందిగా వివరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు పండ్లను పంపిణీ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ కె. విజయ బాబు పాల్గొని ప్రసంగించారు. నేటి తరం గాంధీజీ ఆలోచన విధానాలను అలవర్చుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యాల స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు డా.ఈటెల సమ్మయ్య, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, సిబ్బంది మరియు ఆశ్రమవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరంగల్ భద్రకాళి దేవి శర న్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



హైదరాబాద్ పెన్ పవర్: వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానమును ఈ రోజు ఉదయం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయి లు సందర్శించారు. ఈ నెల 11 వ తేదీ నుండి ప్రారంభమయ్యే శ్రీ భద్రకాళీ దేవీశరన్నవరాత్ర మహోత్సవములసందర్భంగా అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేయు భక్తులకు చేయవలసిన ఏర్పాట్లను సమీక్షించారు. దేవాలయం చుట్టూ నిర్మాణం జరుగుచున్న మాడవీధుల పురోగతిని సమీక్షించారు. అట్లాగే దేవాలయంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో ఎమ్మెల్యే. నాయిని రాజేందర్ రెడ్డి నేత్రుత్వంలో దాతలచే ప్రవీణ్ చారి తమిళనాడు కన్యాకుమారి శిల్పులచే నిర్మాణం గావింపబడుచున్న శ్రీపర్ణికా
దారుమయ(టేకు) రథము నవరాత్రుల లోపు అందజేయాలని శిల్పులను ఆదేశించారు. అట్లాగే పార్కింగ్ కోసం ఏర్పాట్లు కూడా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కుడా అధికారులు, సి పి ఓ. అజిత్ రెడ్డి, ఈ ఈ. భీంరావు దేవాలయ ఈ.ఓ శ్రీమతి రామల సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మగాంధీ, లాల్ బహుదూర్ జయంతి

**మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం పుల్లయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం**



హైదరాబాద్ పెన్ పవర్: మహాత్మా గాంధీ జయంతి, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ సంగం పుల్లయ్య ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించరు.మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ సంగం పుల్లయ్య మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. దేశ సేవలో లాల్ బహదూర్ శాస్త్రి అందించిన స్ఫూర్తి చిరస్మరణీయమని, ఆయన ఇచ్చిన జై జవాన్.. జై కిసాన్ నినాదం నేటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.గాంధీజీ, శాస్త్రిజీ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని విధుల్లో నిబద్ధతతో పనిచేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు



హైదరాబాద్ పెన్ పవర్: దుర్గం మురళి కొత్తగూడ మండలం లోని జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను కొత్తగూడ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రోజు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ రూపుసింగ్ గారి ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ రూపుసింగ్ మాట్లాడుతూ...

లిదేశ స్వాతంత్ర్య పోరాటంలో సత్యం, అహింస అనే ఆయుధాలతో ఆంగ్లేయులను తరిమికొట్టిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. "జై జవాన్ – జై కిసాన్" నినాదంతో దేశానికి దిశానిర్దేశం చేసిన నిరాడంబర నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి అని గుర్తుచేశారు. వారి త్యాగాలు, ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయమని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి మార్గంలోనే పయనిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు వజ్జ సారయ్య, రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి, గుంజేడు ట్రస్ట్ బోర్డు చైర్మన్ బుర్కా నరేందర్,

జిల్లా నాయకులు వీరనేని వెంకటేశ్వర్రావు, జిల్లా ర్ సెల్ ప్రధాన కార్యదర్శి బోడ ఈర్య,

ఓబీసీ జిల్లా నాయకులు వల్లెపు రంజిత్, కా సెల్ మండల అధ్యక్షులు వజ్జ బాలరాజు,యూత్ అధ్యక్షులు చొప్పరి కుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సిరిగిరి సురేష్,గ్రామ కమిటీ అధ్యక్షులు సిద్దబోయిన లక్ష్మి నారాయణ, మాజీ అధ్యక్షులు గుమ్మడి సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ హలవత్ సురేష్,రాజ సెల్ మండల అధ్యక్షులు ఐత అనిల్ ఓబీసీ అధ్యక్షులు నోముల ప్రశాంత్,ప్రధాన కార్యదర్శి యాదగిరి కిరణ్,నాలి బాలకృష్ణ, సతీష్ పాకాల స్వామి,

మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో ఒప్పందం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయడానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్ తో ఒప్పందం చేసుకున్నాయి.హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ని జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు ఈ రెండు సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్ కు సహకారం అందిస్తాయి.నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ సీఎండీ శేఖర్ రెడ్డి , సీఈఓ అనిల్ బాబు తో కలిసి రూ. 5.17 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు.వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థ ప్రతినిధి డి. సుమంత్ , వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ తో కలిసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ. 4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు.ఒక మంచి కార్యక్రమానికి నిధులు అందించి సహకరించడానికి ముందుకు వచ్చిన సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీ తో పాటు ఇతర ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.వచ్చే డిసెంబర్ 9 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి సెంట్రలైజ్డ్ కిచెన్లను ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి శ్రీ . రేవంత్ రెడ్డి గారు ఆదేశించారు. నవంబర్ 30వ తేదీలోగా ఈ కిచెన్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని, విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల కేలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని చెప్పారు.బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని, విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.

ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్‌ను అందించే విధంగా చూడాలని, జీవితకాలం కొనసాగించాల్సిన ఈ కార్యక్రమం కాబట్టి సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు.

# తీర్పు వచ్చే వరకూ ఉప ఎన్నిక వద్దు: ఖైరతాబాద్ పై ఈసీకి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**
రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి కలిగిస్తున్న ఖైరతాబాద్ ఉపఎన్నిక వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికైన దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా దివంగత నేత పి. జనార్ధన్‌రెడ్డి కుమార్తె పి. విజయారెడ్డి గతంలో దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌పై తీర్పు వెలువడే వరకూ ఉపఎన్నిక నిర్వహించడం సరికాదని హైకోర్టు అభిప్రాయపడింది. ఎన్నికల సంఘం ఈసీ తరఫు న్యాయవాది కూడా దీనికి ప్రాథమికంగా అంగీకరించారు. ఈమేరకు, తీర్పు వెలువడేవరకూ ఉపఎన్నిక నిర్వహించబోమంటూ ఈసీ అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. పార్టీ మారినట్లు నిరూపణ కావడంతో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ ఫిరాయింపుల చట్టం ప్రకారం పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. ఫలితంగా ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది.ఈ నేపథ్యంలో విజయారెడ్డి పిటిషన్‌తో ఒక్కసారిగా ఈ ప్రక్రియకు బ్రేక్ పడినట్లయింది.

ఇదీ నేపథ్యం:

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ విజయం సాధించారు. కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన విజయారెడ్డి రెండోస్థానంలో నిలిచారు. ఎన్నికల ఫలితంపై విజయారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల అఫిడవిట్, ఫారం-26లో దానం నాగేందర్ తప్పుడు వివరాలు ఇచ్చారని, వాస్తవాలు దాచిపెట్టారని ఆయనను అనర్హుడిగా ప్రకటించి, రెండోస్థానంలో నిలిచిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని పేర్కొంటూ హైకోర్టును ఆశ్రయించారు. 2024 జనవరి 20న దాఖలైన ఎన్నికల పిటిషన్.. జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఎదుట విచారణలో ఉంది. ఇటీవల దానం నాగేందర్‌పై వేటు పడటం, ఖైరతాబాద్ ఉప ఎన్నిక జరగనుందన్న వార్తల నేపథ్యంలో..విజయారెడ్డి తాజాగా గురువారం హైకోర్టు డివిజన్ బెంచ్ ఎదుట పిటిషన్ దాఖలు చేశారు. తన ఎలక్షన్ పిటిషన్‌పై తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు లేదా ఉపఎన్నిక నిర్వహించనున్నట్లు నోటిఫై చేయకుండా ఈసీని అడ్డుకోవాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ రామకృష్ణారెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

**బీఆర్ఎస్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు**

విజయారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకట రమణ వాదనలు వినిపించారు. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని తాను దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ ఈపీ హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉందని.. అందులో తాను విజయం సాధిస్తే ఓట్లపరంగా రెండోస్థానంలో నిలిచిన తానే ఎమ్మెల్యే అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సదరు ఈపీపై నిర్ణయం వెలువడే వరకు ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసం నోటిఫై చేయకుండా ఈసీని నిలువరించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వర్సెస్ తెలంగాణ రాష్ట్ర సమితి అండ్‌అదర్స్ కేసులో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రస్తుత సందర్భానికి వర్తిస్తుందన్నారు. తమ ఈపీపై తీర్పు వచ్చే వరకూ ఖైరతాబాద్ స్థానాన్ని సాధారణ ఖాళీగా ప్రకటించడానికి, ఉప ఎన్నిక నిర్వహించడానికి వీల్లేదని పేర్కొన్నారు. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి స్పందిస్తూ..పిటిషనర్ వాదనతో తాము ప్రాథమికంగా ఏకీభవిస్తున్నామన్నారు. ఎలక్షన్ పిటిషన్‌పై తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ స్థానానికి ఉపఎన్నిక నోటిఫికేషన్ ఇవ్వబోమన్నారు వాదనలు విన్న ధర్మాసనం..ఈపీపై ఫలితం తేలేవరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయబోమని పేర్కొంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 6న వాయిదా వేసింది.

## గాంధీ భవన్‌లో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ గాంధీ భవన్‌లో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షు డు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, హైదరాబాద్ ఇంచార్జి మంత్రిపొన్నం ప్రభాకర్, మంత్రులు వివేక్ వెంకట్ స్వామి,అజారుద్దీన్ తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, పలువురు డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహం, సత్యనిష్ఠ, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. అలాగే దేశ సేవకు అంకితమైన లాల్ బహదూర్ శాస్త్రి సరళత, నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి వంటి విలువలను గుర్తుచేసుకున్నారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

## గాంధీజీ జీవితం మనందరికీ ఎంతో ఆదర్శప్రాయమైనది

**హైదరాబాద్ పెన్ పవర్:**
జాతిపిత మహాత్మాగాంధీ హింసకు పాల్పడకుండా, శాంతి మార్గంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని మన దేశం నుండి తరిమికొట్టారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మహాత్మా గాంధీ 157 వ జయంతి ని పురస్కరించుకుని నేడు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సికింద్రాబాద్ లోని వీ+ రోడ్డులో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద, గాంధీ హాస్పటల్ గాంధీ విగ్రహం వద్ద పూలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ హాస్పటల్ వద్ద పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ జీవితం మనందరికీ ఎంతో ఆదర్శప్రాయమైనదన్నారు.

గాంధీజీ మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి 'సత్యం', 'అహింస' అనే రెండు బలమైన ఆయుధాలను ఎంచుకున్నారని చెప్పారు. మహాత్మా గాంధీ ఆశయాలైన సత్యం, అహింస, శాంతి మార్గాలను మన జీవితంలో పాటించడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి అన్నారు.

## 30 నెలల్లో దాదాపు రూ. 100 కోట్ల CMRF, LOC, కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ.

**హైదరాబాద్ పెన్ పవర్:** రూ. 3459 కోట్ల అభివృద్ధి పనులు. భజ్యాతి రాష్ట్ర సమితి దీ=పా హయాంలో సంక్షోభం.నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 30 నెలల్లో వనపర్తి నియోజకవర్గం లో దాదాపు 100 కోట్లకు సంబంధించిన జవీ=ఖీ, ూూజ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.శు క్రవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జవీ=ఖీ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.వనపర్తి నియోజకవర్గం లోని ప్రతి కుటుంబానికి తాను ఒక పెద్ద కొడుకులా పనిచేస్తున్నానని నేను చేసే ప్రతి పని వారికి సహాయం కాదని ఎమ్మెల్యేగా తన బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.గతంలో అధికారంలో ఉన్న ఎతీం పార్టీ నాయకులు ఈ క్యాంపు కార్యాలయంలోకి ఏ ఒక్కరిని అనుమతించేవారు కాదని నేడు ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరూ సమానంగా క్యాంపు కార్యాలయం కార్యాకాల పళ్ళు పాల్గొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతుయన్నారు.ఆర్టీసీల్లో ప్రయాణించే మహిళలకు ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు 12 వేలకోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించిందని ఆయన తెలిపారు.200 యూనిట్ ఉంచి విద్యుత్ కోసం 6000 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు.వనపర్తి నియోజకవర్గంలోనే 32,000 మందికి రేషన్ కార్డు అందించి వారికి సన్న బియ్యం చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనని ఎమ్మెల్యే అన్నారు.విద్యాభివృద్ధి కోసం 600 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతుయన్నారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిస్ చార్జీలు పెంచిందని, పాఠశాల దుస్తుల పంపిణీలో పుస్తకాల పంపిణీలోఎలాంటి ఇబ్బందులేకుండా ముందస్తుగానే పంపిణీ చేపట్టిందన్నారు.500 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, లాంటి ఉన్నత విద్యపై ప్రభుత్వం దృష్టి సారించి తెలంగాణ రాష్ట్రాన్ని విద్యాభివృద్ధిలో దేశంలోనే ముందుంచేందుకు చర్యలు చేపట్టిందన్నారు.నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, రుణమాఫీ రైతు భరోసా రైతు బీమా లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రైతుకు వెన్ను దన్నుగా నిలుస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, విద్యార్థులకు దుస్తుల కుట్టడం, సోలార్ ప్లాంట్ లో ఏర్పాటు, ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సమైక్యలకు ఆర్టీసీ బస్సులు కొనుగోలులో భాగస్వామ్యం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అమలుపరుస్తోందన్నారు.గత ప్రభుత్వం కేవలం రోడ్ల వెంట లైట్లు వేసుకుంటూ డివైడర్లు నిర్మించుకుంటూ చెరువు కట్టలపై రివిట్మెంట్ కట్టి అందిన కాడికి కమిషన్లు దండుకొని పోయిందని నిరుపేద ప్రజలకు ఏమి చేయలేదని ఎమ్మెల్యే విమర్శించారు.ఎన్నినో ప్రపంచమంతా ఇబ్బందులు ఎదుర్కొంటుందని దాని ప్రభావంతో ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రత్యేక కమిటీ ద్వారా చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.గత ప్రభుత్వం చేసిన అప్పులను కడుతూనే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు.హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చి ఇచ్చిన హామీల్లో భాగంగా మిగిలిపోయిన మూడు హామీలను సైతం త్వరలోనే అమలుపరుస్తుందన్నారు.బజ్యాతి రాష్ట్ర సమితి గురించి కెసిఆర్ కూతురు కవిత కెసిఆర్ చుట్టూ దొంగలు చేరారని గుంటనక్క హరీష్ రావు, పొట్టోడు నీతీ లు పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేశారని అలాంటివారిని ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని చెప్పడం విశేషమని ఎమ్మెల్యే అన్నారు.కాంట్రాక్టర్ గా చేసుకుంటూ, వ్యవసాయం చేసుకుంటూ పాలముకుంటూ కూలివాడిలాగా పనిచేసుకుంటే తప్పు కాదని కబ్జాలు చేస్తూ కమిషన్లు మింగుతూ ప్రజలను మోసం చేస్తే తప్పని కొందరు సన్యాసులు తనను కూలోడని మాట్లాడడం పై ఎమ్మెల్యే విమర్శించారు.కొల్లాపూర్ లో తన్ని తరిమేస్తే తెలంగాణ సెంటిమెంటును అడ్డుపెట్టుకొని విద్యార్థుల శవాలపై రాజకీయం చేసి అధికారుల్లోకి వచ్చిన మోసగాళ్లు ఒకేసారి ఎమ్మెల్యేగాయి వేళ్ళ కోట్లు దండుకుంటే ప్రజలు తన్ని తరిమేశారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు.కేంద్రంలో ఖార్గే ని, రాష్ట్రంలో స్పీకర్ ని దళితులని అవమానించి పసుపు నీళ్లతో శుద్ధి చేసే దొరల పాలన కాకుండా నేడు రేవంత్ రెడ్డి ప్రజా పాలన నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీ కొని వ్యక్తి మృతి.. మెదక్ పట్టణంలో ఘటన

**మెదక్ : పెన్ పవర్:** మెదక్ పట్టణ పరిధిలోని సీడబ్ల్యూసీ గోదాం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మెదక్ పట్టణానికి చెందిన సద్దాం (40) అక్కడికక్కడే మృతి చెందాడు. సద్దాం కందుర్ కోసం నిత్యావసర వస్తువులు తీసుకురావడానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న మెదక్ పట్టణ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును మెదక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సిరిసిల్ల జిల్లాలో విషాదం.. విద్యుత్ షాక్‌తో దంపతులు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన గంట దేవయ్య -- లక్ష్మి దంపతులు శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందారు. దేవయ్య, లక్ష్మి దంపతులు గ్రామ శివారున గల కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నారు. ఈ క్రమలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దేవయ్య, లక్ష్మి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాశీచందర్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాశీచందర్ రావు వారికి ఘనంగా నివాళులర్పించారు. ఇరువురు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సికింద్రాబాద్ చిలకలగూడ పరిధిలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో పాల్గొని స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా మీడియాతో రాశీచందర్ రావు మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా చేపట్టిన అతిపెద్ద కార్యక్రమాల్లో 'స్వచ్ఛ భారత్' ముఖ్యమైనదని గుర్తుచేశారు. పరిశుభ్రమైన సమాజం ఉండాలన్నది గాంధీజీ జీవితాశయమని, ఆ ఆశయాన్ని నిజం చేస్తూ ప్రధాని మోదీ గారు స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన గాంధీజీకి, 'జై జవాన్ - జై కిసాన్' నినాదంతో దేశాన్ని నడిపించిన మహనీయుడు లాల్ బహదూర్ శాస్త్రి గారికి తన హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు.పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడూ ఇందులో భాగస్వామి కావాలని రామచందర్ రావు గారు పిలుపునిచ్చారు. మన ఇళ్లతో పాటు వీధులు, ఊళ్లను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలన్నారు. మనమందరం కలిసికట్టుగా చేసే ఈ చిన్న ప్రయత్నాలతోనే మన దేశం మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యంగా, అందంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో కత్తెర గుర్తుకు ఓటు వేయండి అన్నా

**బీసీ రాజ్యాధికార యాత్రలో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు కలిసి మాట్లాడిన తీన్మార్ మల్లన్న**

**హైదరాబాద్ పెన్ పవర్:** అక్టోబర్ 9వ తేదీన జరగబోతున్న ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధ లిబహుజన్ వర్కర్స్ యూనియన్ (దీఔఖ)లికు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల కోసం కోట్లాడుతున్న ఏకైక యూనియన్ దీఔఖ మాత్రమే అని,ఎన్నికల్లో గెలిచిన ఆరు నెలల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయించి తీరుతాం అని హామీ ఇచ్చారుఆర్టీసీ కార్మికుల హక్కులు, ఆత్మగౌరవం కోసం కత్తెర గుర్తుపై ఓటు వేసి బహుజన్ వర్కర్స్ యూనియన్‌ను గెలిపించాలని డ్రైవర్లు, కండక్టర్లను తీన్మార్ మల్లన్న కోరారు.

## ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

### గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి: తహసీల్దార్ ఈ. వెంకటలక్ష్మి

**హైదరాబాద్ పెన్ పవర్:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను సి.బెలగల్ మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల తహసీల్దార్ ఈ. వెంకటలక్ష్మి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహాత్మా గాంధీ దేశానికి అందించిన సేవలు, ఆయన పాటించిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత వంటి విలువలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పోషించిన పాత్ర దేశ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన అహింసా మార్గం, సత్యనిష్ఠ, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను నేటి తరానికి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.మహాత్మా గాంధీ కలలుగన్న స్వచ్ఛమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతను పాటించడంతో పాటు ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచాలని సూచించారు.అనంతరం రెవిన్యూఅధికారులు, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి. తరుణ్, పోలకల్ వీఆర్వో రఫీక్ పోలకల్ పంచాయతీ సెక్రెటరీ సునీల్ రాణితదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహనతోనే నేరాల నియంత్రణ

### పోలకల్ గ్రామసభలో నూతన క్రిమినల్ చట్టాలు, మహిళలు--చిన్నారుల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన.

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన పెంచే ఉద్దేశంతో పోలకల్ గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సి.బెలగల్ ఎస్ఐ వేణు గోపాల్ రాజు, తహసిల్దారు, వెంకటలక్ష్మి,ఎంపీడీఓ, రాణమ్మ ఏఓ మల్లేష్ కుమార్ తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీజీ సత్యం, అహింస, శాంతి, సామాజిక బాధ్యత వంటి విలువలను ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.అనంతరం గ్రామస్థులకు ప్రస్తుతం అమల్లో ఉన్న నూతన క్రిమినల్ చట్టాలు, వాటి ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలు, చట్టపరమైన హక్కులు, బాధ్యతలపై ఎస్ఐ వేణు గోపాల్ రాజు అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు లేదా చిన్నారులపై ఎలాంటి వేధింపులు, హింస, ఇతర నేరాలు జరిగినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## బస్సులో పోగొట్టుకున్న వస్తువులు అప్పగింత




బస్సులో పోగొట్టుకున్న వస్తువులను యువతికి అప్పగిస్తున్న దృశ్యం

**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 2:** ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన 149 సర్వీస్ బస్సులో ఓ యువతి తనకు సంబంధించిన స్టడీ సామాగ్రితో పాటు తనకి సంబంధించిన విలువైన పత్రాలను బస్సులోనే మర్చిపోయి వెళ్ళిపోయింది. అది గమనించిన కండక్టర్ హర్యా భద్రపరిచి బస్టాండ్ కంట్రోలర్ రాములుకు అప్పజెప్పారు. యువతిని బస్టాండ్ కు పిలిపించి తనకు అందజేశారు. ఈ సందర్భంగా యువతితో పాటు అధికారులు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

## కోట్లాది భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన జాతిపిత గాంధీ

### సీఎం రేవంత్ రెడ్డి నివాళులు

**హైదరాబాద్ పెన్ పవర్:** అహింసను ఆయుధంగా, సత్యమే మార్గంగా చేసుకుని కోట్లాది భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆమహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. సత్యం, అహింస, సహనం, మానవత్వం, సామాజిక బాధ్యత వంటి మహోన్నత విలువలను ఆచరించి, వాటి శక్తిని ప్రపంచానికి చాటిన మహాత్మా గాంధీ గారి జీవితం యావత్ మానవాళికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## లంగర్ హౌస్ లోని బాపూఘాట్‌లో గాంధీజీకి గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు...

**హైదరాబాద్ పెన్ పవర్:** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని బాపూఘాట్‌లోని గాంధీజీ సమాధి వద్ద గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, పాటు పలువురు పార్టీ నేతలు నివాళులర్పించారు. గాంధీజీ సమాధికి పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన అహింస, సత్యం, శాంతి సిద్ధాంతాలను స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ అందించిన సేవలను నేతలు గుర్తు చేసుకున్నారు.

## గాంధీ ఆకాంక్షలనుగుణంగా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో స్వచ్ఛా భారత్ కార్యక్రమాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
స్వతంత్ర భారత్ మాత్రమే కాదు స్వచ్ఛ భారత్ కావాలనే మహాత్మా గాంధీ ఆకాంక్షలనుగుణంగా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో స్వచ్ఛా భారత్ కార్యక్రమాలు సాగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడురామచందర్ రావు తెలిపారు. మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ చిలకల గూడలో అంగన్ మిలన్ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ బీజేపీ మహంకాళి జిల్లాప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరంబీజేపీ నేతలతో కలిసి చీపురు పట్టి రోడ్లు ఊడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేహాన్ని, ఇంటిని, గల్లిని శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా గ్రామాలను, నగరాలను దేశాన్ని శుభ్రంగాఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో అనేక దేశాలు స్వచ్ఛతకు, శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు.
బైట్.. రామచంద్రరావు (బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు)

## గాంధీ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు

**హైదరాబాద్ పెన్ పవర్:** గాంధీ జయంతిని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ కమిషనర్ పిలుపుమేరకు గోషామహల్ సర్కిల్ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్ లో శానిటేషన్, పారిశుద్ధ కార్మికులు , ఎంటమాలజీ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా గోషామహల్ అసిస్టెంట్ మెడికల్ ఢ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నేహా ఆధ్వర్యంలో సిబ్బందికి ఫిజికల్ టెస్టులతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ హెల్త్ క్యాంపులో పలువురు ఉద్యోగులతో పాటు స్థానిక ప్రజలు కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## డబ్బుల పంపిణీ ఆరోపణలపై రెండు పాఠశాలల్లో ఎస్.ఎం.సి. ఎన్నికలు రద్దు.

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప,అక్టోబర్ 2: పెన్ పవర్:** కలసపాడు మండలంలోని తెల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొండపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్.ఎం.సి.) ఎన్నికలను వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. శ్రీధర్ చెరుకూరి రద్దు చేశారు.ఎస్.ఎం.సి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి డబ్బుల పంపిణీ జరిగినట్లు వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని ఈ రెండు పాఠశాలల్లో జరగాల్సిన ఎన్నికలను రద్దు చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు.ఎస్.ఎం.సి. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ఎటువంటి ప్రలోభాలకు తావులేకుండా నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో డబ్బుల పంపిణీ, ప్రలోభాలు లేదా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగినట్లు గుర్తించినా, లేదా ఫిర్యాదు అందినా, విచారణ చేపట్టి సంబంధిత ఎన్నికలను రద్దు చేసి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎస్.ఎం.సి. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎన్నికల నిర్వహణ అధికారులు, తల్లిదండ్రులు, అభ్యర్థులు సహకరించాలని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కోరారు.

# మా తాతల భూములు మాకే కావాలి

**మా భూములు మాకు వచ్చేవరకు భూ పోరాటం కొనసాగిస్తాం**
**పెద్దకంచ భూ పోరాటం కమిటీ**



**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, (అక్టోబర్ 02):**
మా తాతల భూములు మాకే కావాలనీ, మా భూములు మాకు వచ్చేవరకు భూ పోరాటం కొనసాగిస్తామని పెద్దకంచ భూ పోరాటం కమిటీ నాయకులు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామంలో మా తాతల భూములు మాకే కావాలని పోరాటం చేస్తున్నామన్నారు. 1956లో కాజా మొయినుద్దీన్ వద్ద మా తాతలు సర్వేనెంబర్ 144 నుండి 159 వరకు మొత్తం భూమి 209 ఎకరాల భూమిని కొనుగోలు చేసినారు. అప్పటినుండి ఇప్పటివరకు భూమిపై పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాం. 1974 -75 లో మాకు 38ఈ రావలసి ఉండే కొంతమంది పెత్తందారులు మా కంచపై కావలిగా ఉన్న ముదిరాజులకు 12 మందికి 38 ఈ అక్రమంగా ఇచ్చారు. 1957లో మాకు కోర్టుడిగ్రీ ఇచ్చింది. దానిని మా పూర్వీకులకు అవగాహన లేనందున ఇంప్లిమెంట్ చేసుకోలేకపోయాము. అట్టి భూమిపై ముదిరాజులు పట్టాగా నమోదు చేసుకున్నారు. ఫోర్జరీ సంతకాలతో 2002 లో ముదిరాజులు కృష్ణారావు అనే వ్యక్తికి అమ్ముకున్నారు. అప్పుడే మా భూములు అమ్మడానికి మీరెవరనీ ప్రశ్నించినాము. అప్పటినుండి ఇప్పటివరకు భూ పోరాటం చేస్తూనే ఉన్నాము. మేము గత వారంలో మా పొలం దగ్గర వెళ్లి చదును చేసుకుంటుండగా ఈ పొలం మీకు ఎక్కడిదిరా అని దొరస్వామినాయుడు కొంతమంది గుండాగిరీలను మా పైకి దాడికి పంపి మాపైనే కేసులు పెట్టడం జరిగింది. చాతాల జంగయ్య సిపిఎం పార్టీ జిల్లా నాయకుడు భూస్వాములకు తొత్తుగా వ్యవహరిస్తూ మాపైన కేసులు పెట్టి మా ఇండ్ల పైకి పోలీసులను పంపి భయాందోళనలకు గురి చేస్తున్నాడు. భూస్వాములకు తొత్తులుగా వ్యవహరిస్తున్న భూ కబ్జాదారులకు రియల్ ఎస్టేట్ బ్రోకర్లను హెచ్చరిస్తున్న. ఎన్ని కేసులు పెట్టినా ఈ భూ పోరాటం
మాత్రం ఆగదు. మా తాతల భూమి సాధించుకునే అంతవరకు ఈ పోరాటాన్ని ఐక్యంగా చేస్తామని పెదకంచ భూ పోరాటం కమిటీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు నాయకులు యువకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రేవంత్, కేటీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి: ఎంపీ రఘునందన్ రావు డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల విచారణ సవాళ్లు మరింత ముదురుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని నేతలు దొంగలేనని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ తమ ఆస్తులపై విచారణ కోరుతూ సోమవారం లోగా హైకోర్టుకు లేఖ రాయాలని రఘునందన్ సవాల్ విసిరారు. ఒకవేళ వారు స్పందించకపోతే, తానే స్వయంగా హైకోర్టుకు లేఖ రాస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ముగ్గురం కలిసి సిట్టింగ్ జడ్జికి విచారణ కోసం విజ్ఞప్తి చేద్దామని, తన ఆస్తులపైనా విచారణకు తాను సిద్ధమేనని ప్రకటించారు. ఇటీవల సిరిసిల్ల సభలో కేటీఆర్ ఆస్తుల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేయగా, దానికి ప్రతిగా తమ ఇద్దరి కుటుంబాల ఆస్తులపైనా న్యాయ విచారణ జరిపించాలని కేటీఆర్ సవాల్ చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ కూడా ఈ అంశాన్ని తెరపైకి తేవడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## హీరో పైలట్ స్మిత్‌కు ప్రధాని మోదీ ఫోన్ కాల్.. ఆరోగ్య పరిస్థితిపై ఆరా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫ్లైదుబాయ్ విమానంలో కాక్‌పిట్‌లో ప్రాణాపాయ దాడిని ఎదుర్కొని, 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌తో ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఫోన్‌లో మాట్లాడారు. ఆయన ధైర్య సాహసాలను మనస్ఫూర్తిగా ప్రశంసించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన కెప్టెన్ స్మిత్ సాహసాన్ని, ఆయన చూపిన సమయస్ఫూర్తిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్.. విమానంలో జరిగిన భయానక ఘటన గురించి ప్రధానికి వివరించారు. మత ఛాందసవాదిగా భావిస్తున్న కో-పైలట్ దాడిని ఎదుర్కొనే ధైర్యం తనకు ఎలా వచ్చిందో తెలిపారు. అంతకుముందు గురువారం కూడా ప్రధాని మోదీ.. స్మిత్ కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఆయన సాహసాన్ని కొనియాడారు. భారత ప్రభుత్వం, విదేశాంగ మిషన్లు పైలట్‌కు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నాయని ప్రధాని వారికి భరోసా ఇచ్చారు. ఆరోగ్యం నిలకడగా ఉంది: భారత రాయబారి
ప్రస్తుతం యూఏఈలోని ఆసుపత్రిలో కోలుకుంటున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. యూఏఈలో భారత రాయబారి దీపక్ మిట్టల్.. స్మిత్ మచ్చుర్‌ను, ఆయన కుటుంబాన్ని ఆసుపత్రిలో పరామర్శించారు. "ఆయన మాతో స్వేచ్ఛగా మాట్లాడారు. నవ్వుతూ, ఉల్లాసంగా కనిపించారు. ఇది మాకు, ముఖ్యంగా ఆయన కుటుంబానికి ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది" అని రాయబారి తెలిపారు. స్మిత్‌కు అత్యుత్తమ వైద్యం అందుతోందని, యూఏఈ అధికారులతో భారత రాయబార కార్యాలయం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని మిట్టల్ వివరించారు. దాడి జరిగిన తర్వాత సౌదీ అరేబియా నుంచి స్మిత్‌ను ప్రత్యేక విమానంలో దుబాయ్‌లోని ఆసుపత్రికి తరలించారు. "కెప్టెన్ స్మిత్ ఎంతో ధైర్యాన్ని, సాహసాన్ని ప్రదర్శించి పెను విషాదాన్ని నివారించారు. ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడారు. భారతదేశపు ఈ వీర పుత్రుడిని చూసి మేం గర్విస్తున్నాం. ఆయనకు పూర్తి సహకారం అందిస్తాం" అని అంతకుముందు ఒక ఇంటర్వ్యూలో మిట్టల్ పేర్కొన్నారు.

## మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**హైదరాబాద్ పెన్ పవర్:** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కురవి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన అహింస, సత్యం, శాంతి, సమానత్వం వంటి విలువలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చేసిన సేవలను స్మరించుకున్నారు.
ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు నారాయణ రాజేంద్ర కుమార్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్, జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు అవిరే మోహన్ రావు, బానోత్ తుకారాం నాయక్, మండల కార్యదర్శి శ్యామల శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు దడిగల శరత్, కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు దైద భద్రయ్య, దడిగల వీరేందర్, జిల్లా యూత్ నాయకులు గార్లపాటి భరద్వాజ్, కురవి బీఎల్ఏ నాగరాజ్, రేకుల తండా గ్రామ పార్టీ అధ్యక్షులు బానోతు లాలా నాయక్, కురవి మండల నాయకులు బానోతు లక్ష్మణ్ నాయక్, మిరియాల లచ్చయ్య, తరాల నాగరాజ్, బత్తిని వీరభద్రం, కర్నాటి నాగన్న తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శాంతియుత పోరాటాల ద్వారా సామాజిక మార్పు సాధించడమే గాంధీజీ ఆశయం:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** మహాత్మాగాంధీ అనుసరించిన ప్రజాస్వామిక శాంతియుత పోరాట కార్యాచరణ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తనకు స్ఫూర్తిగా నిలిచిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. ప్రజాస్వామిక హక్కుల సాధనకోసం గాంధీజీ అనుసరించిన సత్యాగ్రహ పంథా నేటి యువతరానికీ ఆచరణీయమన్నారు. గాంధీ జయంతి సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం వారి త్యాగనిరతని స్మరించుకుంటూ ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు.
న్యాయమైన ప్రజల ఆకాంక్షల కోసం, నిరంకుశ ప్రభుత్వాల మీద పోరాడే నాయకత్వం, విశాల దృక్పథంతో తమ పోరాట కార్యాచరణను రూపొందించుకోవాలనే తాత్వికతను గాంధీజీ జీవితం నుంచి నేర్చుకోవాల్సి ఉన్నదని కేసీఆర్ అన్నారు. పీడితులందరినీ సమన్వయం చేసుకుంటూ, భావజాల వ్యాప్తిని చేస్తూ, శాంతియుత పోరాటంలో భిన్న వర్గాలను ఐక్యసంఘటన శక్తిగా తీర్చిదిద్దుకోవాలనే గాంధీజీ ఆశయాలను ప్రతీ ఒక్కరు అనుసరించాలన్నారు. తెలంగాణ సాధన కోసం తాను ఒంటరిగా ముందడుగు వేసిన నాటినుంచి నేటి వరకు ఎన్ని కష్టాలొచ్చినా తాను స్థిత ప్రజ్ఞతతో అనుసరిస్తున్న కార్యాచరణలో గాంధీజీ స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ స్పష్టం చేశారు. విద్వేష పూరిత ప్రసంగాలను, కక్షపూరిత వైఖరులను విడనాడి, ప్రజల నడుమ శాంతి సౌభ్రాతృత్వం పరిఢవిల్లేలా పాలనను కొనసాగించడం ద్వారా మాత్రమే జాతిపిత మహాత్మాగాంధీకి మనం నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

## మహబూబాబాద్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్: :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మహబూబాబాద్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. శబరీష్, పి., ఐ.పి.ఎస్. ముఖ్య అతిథిగా విచ్చేసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ అందించిన సేవలను, అహింస, సత్యం, శాంతి వంటి ఆయన అమూల్యమైన సిద్ధాంతాలను స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలు నేటి ఆధునిక పోలీసు వ్యవస్థకు ఎంతో మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది గాంధీజీ జీవితం నుండి స్ఫూర్తి పొంది, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిబద్ధతతో, పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.
సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, మత సామరస్యం మరియు ప్రజా రక్షణ కోసం పోలీసులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి పౌరుడి హక్కులను గౌరవిస్తూ, సామాజిక న్యాయం మరియు సమానత్వం అనే గాంధీయ సూత్రాలకు అనుగుణంగా ప్రజలతో మమేకం కావాలని ఆయన కోరారు.
ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి, ఆర్.ఐలు భాస్కర్, నాగేశ్వర్రావు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక జన... చంద్రబాబు.. !

**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు.. ఇక నుంచి జన చంద్రబాబుగా మారనున్నారా? అంటే.. ప్రస్తుతం జరుగుతు న్న పరిస్థితులు పరిణామాలను గ్రహిస్తే..ఔననే సమాధానమే వినిపిస్తోంది. బలమైన రాజకీయ పార్టీగానే కాకుండా.. బలమైన ప్రభుత్వాన్ని కూడా నడుపుతున్న చంద్రబాబు.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడంతోపా టు.. భావి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. దీంతో వరుస పర్యటనలు పెట్టుకుని ముందుకు సాగుతున్నారు.

**ప్రతి రోజూ..**

ప్రతి రోజూ సీఎం చంద్రబాబు జిల్లాల్లో పర్యటించేలా వచ్చే 6 మాసాల వరకు(మధ్య స్థానిక ఎన్నికల కోడ్ వచ్చినా) షెడ్యూల్‌ను ఖరారు చేసుకున్నట్టు సీఎంవో వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి 75 ఏళ్ల వయసులో చంద్రబాబు ఇలా జిల్లాల్లో పర్యటించడం, ర్యాంప్ వాక్ చేయడం వంటివి ఆశ్చర్యంగానే ఉన్నా.. ప్రజలకు ఆయనను ఇవే భారీగా కనెక్ట్ చేస్తున్నాయి. ఒకప్పుడు నెలకోసారి మాత్రమే చంద్రబాబు జిల్లాల పర్యటనలు పెట్టుకునే వారు. కానీ, ఇప్పుడు రూట్ మార్చారు. ప్రతి రోజూ.. పర్యటనలు పెట్టుకుంటున్నారు. ప్రతి జిల్లాలోనూ ఏదో ఒక కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. రాజకీయంగానే కాకుండా.. ప్రభుత్వ పాలన విషయంలోనూ ఈ పర్యటనలు దోహదపడుతున్నాయన్నది పరిశీలకులు చెబుతున్న మాట. అంటే.. ముఖ్యం గా జన్ జీ ని తనదైన శైలిలోఆకట్టుకునేందుకు కూడా ప్రయత్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించడం ద్వారా మూడు అంశాల్లో



చంద్రబాబు రాణిస్తున్నారన్నది ఒక అంచనా.

1) ప్రజల నాడిని నేరుగా తెలుసుకునే అవకాశం. తద్వారా ప్రభుత్వ పనితీరును మరింత మెరుగు పరుచుకునే దిశగా చంద్రబాబు అడుగులు వేస్తున్నారు.

2) పార్టీని స్థిరీకరించడం.. టీడీపీఅతిపెద్ద పార్టీగా ఉన్న నేపథ్యంలో నాయకుల వ్యవహారాలు. .కార్యకర్తల పనితీరు వంటివాటిని చంద్రబాబు నేరుగా సమీక్షిస్తున్నారు. ఎక్కడ పర్యటన ఉంటే అక్కడ దాదాపు ఆయన నాయకులతో విడిగా భేటీ అవుతున్నారు. స్థానిక పరిస్థితులు తెలుసుకునివారికి దిశానిర్దేశం చేస్తున్నారు.

3) ప్రత్యర్థులపై దృష్టి.. చంద్రబాబు తన పర్యటనలో కేవలం పార్టీపరంగానేకాకుండా.. ప్రత్యర్థుల దూకుడు, ఆయా పార్టీలనాయకుల పనితీరును కూడా తెలుసుకుని.. దానికి అనుగుణంగా టీడీపీ నాయకులను సమాయత్తం చేస్తున్నారు. మొత్తంగా చంద్రబాబు.. జన చంద్రబాబుగా మారుతున్నారన్నది టీడీపీ వర్గాల్లో వినిపిస్తున్న మాట.

# ఆంధ్రప్రదేశ్ బిడ్డని అంటున్న అంబానీ కుమారుడు : హార్టీకల్చర్ హబ్ ప్రారంభోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా అనంత్...



**హైదరాబాద్ పెన్ పవర్:** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏర్పాటు చేసిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్యఅతిథిగా హాజరైన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన ప్రముఖ పారిశ్రామిక వేత్త అనంత్ అంబానీ ప్రసంగించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముందు సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రి లోకేశ్, ఇతర అధికారులతో అనంత్ అంబానీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంత్ అంబానీని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆలింగనం చేసుకుని ఐఎస్ఏ ఏర్పాటుకు ముందుకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.రాయలసీమలో గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరగా, రిలయన్స్ సముఖత వ్యక్తం చేసింది. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో పంటలను లాభసాటిగా చేసేందుకు రైతులకు అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఐఎస్ఏ పనిచేయనుందని చెబుతున్నారు. ఇక ఐఎస్ఏ శంకుస్థాపన నిమిత్తం మదనపల్లె వచ్చిన అనంత్ అంబానీకి అపూర్వ స్వాగతం పలికారు. ఇది చూసి పులకించిపోయిన అనంత్ అంబానీ సభా వేదికపై ఆనందం వ్యక్తం చేశారు. ఇక నుంచి తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించాలని, రాష్ట్రానికి తాను ఏవిధంగా సేవ చేయగలనో సీఎం చంద్రబాబు తనకు మార్గదర్శనం చేయాలని కోరారు.రాయలసీమలో ఏర్పాటు చేస్తున్న హార్టికల్చర్ హబ్ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని అనంత్ అంబానీ వ్యాఖ్యానించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' కూడా అద్భుతంగా ఎదుగుతుందని, దీని ద్వారా అన్నదాతలను తమ కమతాలకే సీఈఓలుగా మారుస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని దేశ యువత అంతా కలిసి సాకారం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మదనపల్లె ప్రాంతానికే ప్రత్యేక చరిత్రాత్మక ప్రాధాన్యత ఉందని గుర్తుచేస్తూ.. ఇక్కడే గురుదేవ్ రబీంద్రనాథ్ టాగూర్ జాతీయ గీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించారని చెప్పారు.గాంధీజీ సర్వోదయ, అంత్యోదయ స్ఫూర్తితో పాటు లాల్ బహదూర్ శాస్త్రి, అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రధాని నరేంద్ర మోదీల నినాదాల కలయికతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ పనిచేస్తుందని అనంత్ అంబానీ వివరించారు. టెక్నాలజీ సాయంతో రైతుల ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఈ మిషన్‌ను చేపట్టారన్నారు. ఏఐ, డ్రోన్లు, రోబోటిక్స్ వంటి అధునాతన సాంకేతికతతో పంటలకు చీడపీడలు సోలకుండా ప్రెసిషన్ ఫార్మింగ్ విధానాన్ని అమలు చేయడానికి ఐఎస్ఏ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. మదనపల్లె టమాటో రైతులు తమ ఉత్పత్తులను ఎక్కడ, ఎప్పుడు విక్రయించాలో సరైన మార్గదర్శకత్వం చేస్తామన్నారు. రిలయన్స్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని అన్నదాతలను 'ఉర్జా దాతలు'గా మారుస్తామని అనంత్ అంబానీ వెల్లడించారు. రిలయన్స్ గ్రీన్ బిజినెస్ కింద సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు. దేశ్ సేవా – కిసాన్ సేవా నినాదంతో ముందుకు వెళ్తున్నామని, జామ్‌నగర్‌లో బయో ఎనర్జీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. 'జియో కృషి' యాప్ ద్వారా రైతుల ఇంటి ముంగిటకే అన్ని రకాల సేవలు అందిస్తామన్నారు. పశు సేవా హి ప్రభు సేవా అని నమ్మే వ్యక్తినని పేర్కొంటూ.. హైటెక్ యానిమల్ హస్పిటల్ ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపదను పెంచుతామని, వంతారా ద్వారా మూగజీవాలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం వల్ల భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ప్రశంసించారు. ఏపీకి సుమారు రూ. 14 లక్షల కోట్ల మెగా ఇన్వెస్ట్‌మెంట్లు వచ్చి, 11 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించడం రాష్ట్ర ఆర్థిక పురోగతికి నిదర్శనమన్నారు. గ్రామీణ వాణిజ్యం, సుస్థిర గ్రామాల అభివృద్ధికి నేడు పటిష్టమైన పునాది పడిందని, ఈ బృహత్ కార్యంలో రిలయన్స్ తన వంతు సహకారాన్ని నిరంతరం అందిస్తుందని అనంత్ అంబానీ తమ ప్రసంగాన్ని ముగించారు.

# జనసేన వైపు వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలు

**విజయవాడ, అక్టోబరు 2,**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున జనసేన పార్టీ వైపు క్యూ కడుతున్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంపై నమ్మకంతో పాటు, ఏపీ సర్కార్‌లో ఉప ముఖ్యమంత్రిగా ఆయన పెంచుకున్న రాజకీయ గ్రాఫ్ ఈ చేరికలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రతిపక్షం నుంచి నాయకులు వరుసగా వచ్చి చేరుతుండటం వల్ల జనసేనకు రాజకీయంగా కొత్త ఊపు, ఒక బలమైన పొలిటికల్ మూమెంటం లభిస్తోంది. అయితే, ఈ చేరికలు పార్టీని నిజంగా ఒక ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా మారుస్తాయా? లేక కేవలం తాత్కాలిక హడావుడికే పరిమితమవుతాయా ? ఏ రాజకీయ పార్టీకైనా నాయకులు, కేడర్ వరుసగా రావడం అనేది ప్రజాక్షేత్రంలో సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. వైఎస్సార్‌సీపీ నుంచి నేతలు జనసేనలోకి రావడం ద్వారా రాష్ట్రంలో భవిష్యత్తు జనసేనదే అన్న అభిప్రాయం ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ బలపడుతోంది. ఇది పార్టీ ఇమేజ్‌ను పెంచడానికి, ద్వితీయ శ్రేణి కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి ఉపయోగపడుతుంది. ఈ చేరికల వల్ల రాజకీయ మూమెంటం వచ్చినప్పటికీ, జనసేన ప్రస్తుతం టిడిపి–జనసేన–బీజేపీ అధికార కూటమి లో భాగంగా ఉంది. ఒక పార్టీ అధికార కూటమిలో ఉంటూ సొంతంగా ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని, స్వతంత్ర ప్రత్యామ్నాయ శక్తిని ఆక్రమించడం సాధ్యం కాదు. ప్రభుత్వం సాధించే విజయాల్లో భాగస్వామ్యంతో పాటు, ప్రభుత్వ వ్యతిరేకత వస్తే దాని ప్రభావం కూడా జనసేనపై పడుతుంది. అందువల్ల ఎంతమంది నాయకులు చేరినా, కూటమి పరిధిలోనే పవన్ కళ్యాణ్ రాజకీయం చేయాల్సి ఉంటుంది.ఎంతమంది వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు , దిగ్గజ నాయకులు జనసేన కండువా కప్పుకున్నా, ఎన్నికల సమయానికి వచ్చేసరికి పొత్తుల ధర్మం ప్రధాన అడ్డంకిగా మారుతుంది. కూటమి ఒప్పందం ప్రకారం జనసేనకు పరిమిత సంఖ్యలోనే స్థానాలు దక్కే అవకాశం ఉంటుంది. దాంతో, కొత్తగా చేరిన సీనియర్ నేతలందరికీ టికెట్లు కేటాయించడం పవన్ కళ్యాణ్‌కు కత్తిమీద సాములా మారుతుంది. టికెట్లు దక్కని నాయకులు మళ్లీ అసంతృప్తికి గురై పార్టీ మారే లేదా తిరుగుబాటు చేసే ప్రమాదం కూడా ఉంది. జనసేనలో ఈ చేరికలు పూర్తి స్థాయిలో ఉపయోగపడాలంటే, ఆ పార్టీ భవిష్యత్తులో కూటమి నుంచి బయటకు వచ్చి ఒంటరిగా పోటీ చేసే పరిస్థితి కి ఎదగాలి. కూటమికి అతీతంగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి పీఠం లక్ష్యంగా జనసేన ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా మారినప్పుడే ఈ నేతల చేరికలు నిజమైన సీట్లుగా, ఓట్లుగా మారతాయి. లేకపోతే, టీడీపీ కేటాయించే కొన్ని సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.మరో కీలకమైన అంశం ఏంటంటే.. మొదటి నుంచీ పవన్ కళ్యాణ్ వెంట ఉండి, పార్టీ కోసం కష్టపడిన జనసైనికులు ,

సిద్ధాంతపరమైన కార్యకర్తలు ఉన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నుంచి వస్తున్న నాయకులు ఎక్కువ భాగం అధికారంలో ఉండగా ప్రయోజనాలు పొందినవారే. అకస్మాత్తుగా పార్టీలోకి వచ్చిన కొత్త నాయకులకు ప్రాధాన్యత ఇస్తే, పాత కేడర్‌లో అసంతృప్తి రగిలే అవకాశం ఉంది. ఈ పాత–కొత్త నేతల మధ్య సమన్వయం కుదర్చడం జనసేన అధిష్టానానికి పెద్ద పరీక్షగా మారనుంది వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి వరుస చేరికలు పార్టీ వృద్ధికి మంచి సంకేతమే అయినా, అది కేవలం పొలిటికల్ మూమెంటం వరకే పరిమితమవుతుంది. పవన్ కళ్యాణ్ తన పొత్తుల వ్యూహాన్ని, భవిష్యత్ రాజకీయ ప్రణాళికను స్పష్టంగా రూ పొందించుకుంటే తప్ప, ఈ నాయకుల బలం సీట్ల రూపంలోకి మారడం కష్టం. కూటమి పరిమితులను దాటుకొని జనసేన తన సొంత జెండాపై ఏ మేర అధికారాన్ని డిమాండ్ చేయగలదనే దానిపైనే ఈ చేరికల అసలు ఫలితం ఆధారపడి ఉంటుంది.

## పేర్ని నానికి దారెటు...

**విజయవాడ, అక్టోబరు 2, పెన్ పవర్: :** మచిలీపట్నం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పేర్ని నాని ప్రదర్శించిన అసహనం, ఆయన చేసిన వ్యాఖ్యలు నానిలో ఆశలు అడుగంటిపోయిన తీరును స్పష్టం చేస్తోంది. గత ఐదేళ్ల పాలనలో సొంత సామాజిక వర్గానికి, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయలేదనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి బలంగా వినిపిస్తూండటంతో ఆయన తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. సమావేశంలో నిలదీతలు ఎదురవడంతో,



ఎమ్మెల్యేలకు కులాలు ఏంట్రా? అంటూ ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలు సొంత పార్టీ వర్గాల్లోనే చర్చకు దారితీశాయి.సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో సామాజిక సమీకరణాలను బలంగా ఉపయోగించుకున్న నాయకుడే ఇప్పుడు ఎమ్మెల్యేలకు కులాలేంటి అని మాట్లాడాల్సి రావడం వెనుక ఉన్న నైరాశ్యాన్ని చూపిస్తోంది. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో మచిలీపట్నంలో కాపు సామాజిక వర్గానికి గానీ, క్షేత్రస్థాయి కార్యకర్తలకు గానీ ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత దక్కలేదనే అసంతృప్తి కేడర్‌లో నెలకొంది. దానికి సమాధానం చెప్పలేక, భావోద్వేగపూరిత వ్యాఖ్యలతో కార్యకర్తల గళాన్ని అణచివేసే ప్రయత్నం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సొంత కేడర్ నుంచి వచ్చిన ప్రశ్నల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రస్తుత మంత్రి కొల్లు రవీంద్రపై ఆరోపణలు గుప్పించారన్న విమర్శలు వస్తున్నాయి. టీడీపీలో పదవులు అమ్ముకుంటున్నారని, తాను మాత్రం కష్టపడిన వారికే గుర్తింపునిచ్చానని పేర్ని నాని చెప్పుకొచ్చినప్పటికీ, అది ప్రత్యర్థిపై నెపం నెట్టే ప్రయత్నంగానే కనిపిస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. స్థానికంగా టీడీపీ కూటమి బలంగా పుంజుకోవడం, మంత్రిగా కొల్లు రవీంద్ర దూకుడు ప్రదర్శిస్తుండటంతో వైసీపీ నేతలు ఆత్మరక్షణలో పడ్డారనే సంకేతాలు ఈ సమావేశం ద్వారా స్పష్టమయ్యాయి.ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తన కుమారుడు పేర్ని కిట్టు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోవడం కూడా నానిని మరింత ఇబ్బందికి గురిచేస్తోందనే చర్చ నడుస్తోంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడంలో నాయకత్వం విఫలమవుతోందని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో పేర్ని నాని వ్యవహరించిన తీరు భవిష్యత్ రాజకీయాలపై చేతులెత్తేసిన భావనను కలిగిస్తోందని, నియోజకవర్గంలో పట్టు నిలుపుకోవడం వైసీపీకి పెను సవాలుగా మారిన సూచనలు కనిపిస్తున్నాయి.

## గ్రేటర్ ఎన్నికలపై ఆచితూచి అడుగులు

**హైదరాబాద్, అక్టోబరు 2, ( పెన్ పవర్:** ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ ఉపఎన్నికల కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల వ్యవధిలోనే ఇక్కడ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్‌తో పాటు విస్తృతమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా స్థానిక సమరానికి ఎందుకు ముహూర్తం ఖరారు కావడం లేదనేది ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. జీహెచ్‌ఎంసీ పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ, ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల వైపు వేగంగా అడుగులు వేయకపోవడం వెనుక పలు రాజకీయ, పరిపాలనాత్మక కారణాలు ఉన్నాయి.గ్రేటర్ పాలనను మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్‌ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిగా విభజించారు. ఈ విభజన తదుపరి పునర్విభజన , వార్డుల సంఖ్య పెంపు, బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో నడుస్తున్న వివాదాలు ప్రభుత్వం ముందుకు రాకుండా అడ్డంకిగా మారాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎలాగూ తప్పదు కాబట్టి, అదే ఊపులో గ్రేటర్ ఎన్నికలను కూడా నిర్వహించి ముగించేస్తే ఒక పని అయిపోతుందనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. ఈ వరుస విజయాలు అధికార పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చాయనడంలో సందేహం లేదు. అయినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ స్థానిక పోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎందుకు సందేహిస్తోంది? మొదటిది, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఉపఎన్నికల సరళి వేరు, మున్సిపల్ వార్డు స్థాయి ఎన్నికల సరళి వేరు. కార్పొరేటర్ల స్థాయి పోరులో స్థానిక సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, మూసీ పునరుజ్జీవన పథకం వల్ల ప్రభావితమైన నిర్వాసితుల అసంతృప్తి నేరుగా ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కొన్ని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల్లో కొంత కలకలం రేపాయి. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా గ్రేటర్ ఎన్నికలకు వెళ్తే అది ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు కలిసివస్తుందేమోననే భయం కాంగ్రెస్ స్థానిక నేతల్లో ఉందనే ప్రచారం ఉంది.రెండవది, కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న బలమైన కేడర్ కొరత. గతంలో ఎంఐఎమ్, బీఆర్ఎస్‌లకు గ్రేటర్‌లో పక్కా యంత్రాంగం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కొంతమంది విలీనమైనప్పటికీ, వార్డు స్థాయిలో 300 వార్డుల పరిధిలో సరైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడం కాంగ్రెస్‌కు ఐక్యతాపరంగా పెద్ద సవాలుగా మారనుంది. పార్టీ అంతర్గత విభేదాలు బయటపడితే గ్రేటర్ గెలుపుపై ప్రభావం పడుతుందనే యోచనలో నాయకత్వం ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం కాంగ్రెస్‌కు లిట్మస్ టెస్ట్‌గా మారబోతోంది. ఒకవేళ ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ , కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తే, ఆ పొలిటికల్ వేవ్‌ను వాడుకుని తక్షణమే గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అప్పటివరకు న్యాయస్థానాల్లో ఉన్న లీగల్ అడ్డంకులను క్లియర్ చేసి, వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.రాబోయే 3 నుంచి 4 నెలల్లో ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు గ్రేటర్ సమరంపై రేవంత్ రెడ్డి సర్కార్ ఒక స్పష్టమైన నిర్ణయానికి రాక తప్పదు.

## గులాబీ కోటలను బద్దలు కొడతారా..

**కరీంనగర్, అక్టోబరు 2, పెన్ పవర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయ కంచుకోటగా భావించే సిరిసిల్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన అధికారిక అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ బహిరంగ సభ మార్పు సంకేతాలు ఇచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ నిర్వహించే ఏ సభకైనా యంత్రాంగం, నిధుల అండతో జనాన్ని సమీకరించడం సహజమే అయినప్పటికీ.. సిరిసిల్ల సభకు తరలివచ్చిన జనసందోహంలో ఒక ఆర్గానిక్ ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనిపించింది. బలవంతపు తరలింపులకు, స్వచ్ఛందంగా తరలివచ్చే ప్రజా స్పందనకు మధ్య ఉండే విభజన రేఖ ఈ సభలో స్పష్టంగా రుజువైంది. కేటీఆర్‌కు ఎదురేలేదని భావించిన స్వంత గడ్డపైనే ఇంతటి భారీ స్థాయిలో కాంగ్రెస్ బలప్రదర్శన విజయవంతం కావడం గులాబీ శిబిరాన్ని ఆత్మరక్షణలోకి నెట్టింది.తెలంగాణ ఉద్యమ కాలం నుంచి సుదీర్ఘంగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్‌పై స్థానికంగా యాంటీ–ఇన్‌కంబెన్సీ నెమ్మదిగా బలపడుతోందన్న సంకేతాలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఉద్యమ సెంటిమెంట్ పూర్తిగా కనుమరుగైపోవడంతో.. ప్రజలు ఇకపై కేవలం భావోద్వేగాల ఆధారంగా కాకుండా, క్షేత్రస్థాయి పాలన, నేత అందుబాటులో ఉండే తీరు, చేనేత–రైతు సంక్షేమ హామీల అమలు ఆధారంగానే తమ రాజకీయ తీర్పులను నిర్ణయించే వాస్తవికతలోకి వచ్చారు. గత పదేళ్లలో ఐటీ హబ్‌లు, హైటెక్ మౌలిక వసతుల పేరిట జరిగిన ప్రచారం క్షేత్రస్థాయి సామాన్యుల జీవితాలను ఎంతవరకు మార్చిందనే ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ బాధితుల సమస్యలు, నేతన్నల ఆత్మహత్యల నివారణలో గత ప్రభుత్వ వైఫల్యాలు ఇప్పటికీ పచ్చిగానే ఉండటం స్థానిక అసంతృప్తికి ఆజ్యం పోస్తోంది.ఈ ప్రజా వ్యతిరేకత కేవలం అసెంబ్లీ సభతోనే మొదలుకాలేదు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనే దీనికి స్పష్టమైన సంకేతాలు కనిపించాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు భారీ మెజారిటీ లభించడం కేటీఆర్ రాజకీయ ఆధిపత్యానికి పడిన మొదటి గట్టి ఎదురుదెబ్బ. బండి సంజయ్‌కు 73 వేల ఓట్లు వస్తే , బీఆర్ఎస్ అభ్యర్థికి 65వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. కేటీఆర్ తన సొంత ఇలాకాలోనే ఆధిక్యాన్ని కాపాడుకోలేకపోయారన్న నిజం.. ఓటర్ల మైండ్‌సెట్ మారిపోయిందనడానికి తిరుగులేని ఆధారంగా నిలిచింది. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు ఏకపక్ష మద్దతు ఇచ్చిన ఓటర్లు క్రమంగా బీజేపీ వైపు మొగ్గు చూపడం ప్రారంభించగా.. ఇప్పుడు ఆ రాజకీయ శూన్యంలోకి కాంగ్రెస్ వేగంగా చొచ్చుకువెళ్లేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తుగడలు సిరిసిల్ల రాజకీయాలను మునుపటి కేటీఆర్ వర్సెస్ ఇతరులు స్థాయి నుంచి మార్చి, కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ ప్రధాన పోరుగా తీర్చిదిద్దే దిశగా సాగుతున్నాయి. గత లోక్ సభ ఎన్నికల ఫలితాలతో రెండో స్థానానికి వెళ్లిన బీఆర్ఎస్‌ను పూర్తిగా మూడో స్థానానికి పరిమితం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సంక్షేమ పథకాలను రేవంత్ సిరిసిల్లాపై కేంద్రీకరిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, స్థానిక వర్గాలకు భరోసా ఇస్తూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలమైన సంస్థాగత పునాదులను ఏర్పాటు చేస్తోంది. ఈ సభ ద్వారా రేవంత్ రెడ్డి వేసిన తొలి అడుగు భవిష్యత్తులో మరింత దూకుడుగా మారనుందని, కేటీఆర్‌ను ఆయన సొంత గడ్డపైనే రాజకీయంగా కట్టడి చేసేందుకు కాంగ్రెస్ దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు వెళ్తోందని స్పష్టమవుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# హెచ్-1బీ వీసా విజయం.. అమెరికా కలల బాటలో భారతీయ ఐటీ రంగానికి లభించిన బిగ్ రిలీఫ్

సొంతదేశంలో పొందిన అపారమైన జ్ఞానాన్ని ప్రపంచ వేదికపై నిరూపించుకోవాలని.. అమెరికా గడ్డపై అడుగుపెట్టి తమ కలలను సాకారం చేసుకోవాలని తపించే వేలాది మంది భారతీయ యువతకు ఒక అద్భుతమైన.. స్ఫూర్తిదాయకమైన శుభవార్త అందింది. హెచ్1బీ వీసాలపై ట్రంప్ ప్రభుత్వం విధించాలనుకున్న భారీ ప్రతిబంధకానికి అమెరికా ఫెడరల్ కోర్టు బలమైన అడ్డుకట్ట వేసింది. కష్టపడే మనస్తత్వం, పట్టుదల, ప్రతిభ ముందర ఎలాంటి చట్టపరమైన ప్రతిబంధకాలైనా తలవంచక తప్పవని ఈ చారిత్రాత్మక విజయం మరొకసారి రుజువు చేసింది.

**కోర్టు తీర్పుతో న్యాయానికి లభించిన ప్రాధాన్యత**

కాలిఫోర్నియా ఫెడరల్ కోర్టు జడ్జి హేవుడ్ ఎస్. గిల్లియం జూనియర్ వెలువరించిన ఈ తీర్పు కేవలం ఒక న్యాయపరమైన నిర్ణయం మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణుల శ్రమకు లభించిన గౌరవం. కొత్తగా హెచ్1బీ వీసా పొందే ఉద్యోగులపై విధించాలనుకున్న 1,00,000 డాలర్ల (సుమారు 84 లక్షల రూపాయలు) ఆకాశాన్నంటే ఫీజు నిర్ణయాన్ని అమలు చేసే క్రమంలో ప్రభుత్వం సరైన చట్టపరమైన విధానాలను, ప్రజాభిప్రాయ సేకరణను పాటించలేదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ నిర్ణయం అమెరికాలోని ప్రముఖ సాంకేతిక సంస్థలు, స్టార్టప్‌లు, విదేశీ నైపుణ్యాలను విశ్వసించే వ్యాపార వేత్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. గతంలో మసాచుసెట్స్ కోర్టు ఇచ్చిన తీర్పును బలపరుస్తూ వచ్చిన ఈ తాజా ఆదేశం, న్యాయపోరాటంలో ప్రజాస్వామ్య సూత్రాల విజయాన్ని చాటిచెప్పింది.

**భారతీయ మెదళ్లకు, గ్లోబల్ టెక్ ప్రపంచానికి కొత్త ఊపిరి**

అమెరికా హెచ్1బీ వీసా వ్యవస్థలో దాదాపు 70 శాతానికి పైగా వాటాతో భారతీయులు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్నారు. భారతీయ టెక్నాలజీ నిపుణుల శ్రమ, మేధస్సు అమెరికా ఆర్థిక వ్యవస్థను, గ్లోబల్ ఐటీ రంగాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. ఒకవేళ ఈ 1,00,000 డాలర్ల ఫీజు అమల్లోకి వచ్చి ఉంటే విశ్వవిద్యాలయాల నుంచి పట్టాలు పొంది సరికొత్త కలలతో ఎదురుచూస్తున్న యంగ్ గ్రాడ్యుయేట్ల అవకాశాలు దెబ్బతినేవి. చిన్న తరహా పరిశ్రమలు, స్టార్టప్‌లు అత్యుత్తమ భారతీయ ప్రతిభను నియమించుకోవడంలో తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొనేవి. అయితే ఈ కోర్టు బ్రేక్‌తో ఆందోళనల మేఘాలు తొలగిపోయి ప్రతిభావంతులైన యవత ఆశలకు మళ్లీ రెక్కలు తొడిగినట్లయింది.

**కలలను ఆపలేవు ఏ ఆటంకాలు.. యువతకు ఇచ్చే సందేశం**

ఈ పరిణామం మనకు నేర్పే పాఠం ఒక్కటే ప్రతిభ, నిబద్ధత ఉంటే ఎంతటి క్లిష్ట పరిస్థితులనైనా అధిగమించవచ్చు. ఇది కేవలం ఒక నిలిపివేత మాత్రమే అయినప్పటికీ ప్రపంచ వేదికపై పోటీపడే నైపుణ్యం ఉన్న ప్రతి ఒక్కరికీ ఇది ఒక గొప్ప సానుకూల సంకేతం. తాత్కాలిక సవాళ్లు ఎదురైనా.. దార్శనికత కష్టపడే తత్వం ఉన్న ఉద్యోగార్థులకు అవకాశాల తలుపులు ఎప్పటికీ మూతపడవు.

రాబోయే రోజుల్లో న్యాయపరమైన ప్రక్రియలు ఎలా సాగినా.. భారతీయ టెక్ నిపుణులు తమ అసమానమైన సేవలతో గ్లోబల్ డిజిటల్ విప్లవంలో ముందు వరుసలోనే ఉంటారనడంలో సందేహం లేదు. శ్రమ నీదైతే.. విజయం తప్పక నీదే అవుతుంది.

# 57 రోజుల పోరాటం.. అమెరికాలో తెలంగాణ యువతిది ఓ విషాదాంతం



ఉన్నత చదువులు పూర్తిచేసి.. మంచి ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనే ఎన్నో ఆశలు, ఆశయాలతో అమెరికా విమానమెక్కిన ఓ తెలంగాణ యువతి జీవితం ఊహించని రీతిలో విషాదాంతమైంది. క్యాన్సర్ మహమ్మారితో 57 రోజుల పాటు సుదీర్ఘ పోరాటం చేసిన మాన్వితా రెడ్డి (26) అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం బాల్టిమోర్‌లో కన్నుమూశారు. నూరేళ్ల ఆయుష్షుతో మురిసిపోవాల్సిన చిన్న వయసులోనే ఆమె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అమెరికాలోని తెలుగు ప్రవాస సమాజం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది.మాన్వితా రెడ్డి తన కెరీర్‌ను ఉన్నత స్థానంలో నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో అమెరికాకు వెళ్లారు. భవిష్యత్తుపై ఎన్నో అందమైన కలలు కంటున్న తరుణంలో నిర్వహించిన సాధారణ వైద్య పరీక్షల్లో ఆమెకు తీవ్రమైన అనారోగ్యం ఉన్నట్లు తేలింది. వైద్యులు విస్తృతంగా పరీక్షలు నిర్వహించి ఆమె 'స్టేజ్-4 స్క్వామస్ సెల్ కార్సినోమా'తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. ఇది తల, మెడ భాగాలను వేగంగా ప్రభావితం చేసే అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్ రకాల్లో ఒకటిగా వైద్యులు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే బాల్టిమోర్‌లోని ఆసుపత్రిలో అత్యవసర చికిత్స ప్రారంభించారు. ఆసుపత్రి వైద్య బృందం నిరంతర పర్యవేక్షణలో ఆమెకు మెరుగైన వైద్యం అందించినప్పటికీ రోజురోజుకూ ఆరోగ్యం క్షీణించడంతో దాదాపు రెండు నెలల పాటు మృత్యువుతో పోరాడి ఆమె చివరకు ప్రాణాలు కోల్పోయారు.మాన్విత తల్లిదండ్రులు, సొంత కుటుంబ సభ్యులు భారత్‌లోనే ఉండటంతో ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో బంధువులు, స్నేహితులే ఆపద్బాంధవులుగా నిలిచారు. ఆసుపత్రి ఖర్చులు, నిత్యం తోడుగా ఉంటూ మానసిక ధైర్యాన్ని అందించడంలో స్నేహితులు కీలక పాత్ర పోషించారు. చిన్న వయసులోనే మాన్వితా రెడ్డి ఇలాంటి కోలుకోలేని అనారోగ్యంతో ప్రాణాలు విడవడం అమెరికాలోని భారతీయ సమాజంలో ముఖ్యంగా తెలుగు వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.మాన్విత భౌతికకాయాన్ని స్వదేశానికి, ఆమె సొంత ఊరికి పంపించేందుకు స్థానిక తెలుగు సంఘాలు, భారతీయ సమాజం ముందుకు వచ్చాయి. మృతదేహ తరలింపునకు కావలసిన అధికారిక పత్రాలు, చట్టపరమైన లాంఛనాలను పూర్తి చేయడంలో వారు కుటుంబ సభ్యులకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారు. విదేశాలలో ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం వెళ్లే యువత జీవితాల్లో అనుకోని ఆరోగ్య సమస్యలు ఎలాంటి భయాందోళనలను, కష్టాలను సృష్టిస్తాయో ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువతి జీవితం ఇలా అర్ధంతరంగా ముగిసిపోవడం ఆమె కుటుంబానికి తీరని లోటుగా మిగిలిపోయింది.

# హెచ్-1బీ వీసా వ్యవస్థను పూర్తిగా రద్దు.. బాంబుపేల్చిన జేడీ వాన్స్.. భారతీయుల్లో గుబులు

వేలాది మైళ్ల దూరం నుంచి కళ్లలో వందలాది కలలను నింపుకుని, రెక్కలొచ్చిన పక్షుల్లా అమెరికా గడ్డపై వాలుతారు మన భారతీయ యువకులు. పగలనక, రేయనక కష్టపడి ఐటీ నుంచి టెక్నాలజీ వరకు ప్రతీ రంగంలో తమ ముద్ర వేస్తూ.. "అమెరికన్ డ్రీమ్"ను నిజం చేసుకుంటున్నారు. కానీ ఇప్పుడు ఆ కలల సౌధాన్ని ఒక్కసారిగా ప్రకంపనలకు గురిచేసే సంచలన వ్యాఖ్యలు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నుంచి వచ్చాయి. హెచ్-1బీ వీసా వ్యవస్థను పూర్తిగా రద్దు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు లక్షలాది భారతీయ కుటుంబాల్లో తీరని ఆందోళనను.. కంటిమీద కునుకు లేని భయాన్ని నింపాయి.

**అసలేం జరిగింది? ఏమా వాన్స్ వ్యాఖ్యల అంతరార్థం?**

అమెరికన్ కంపెనీలు తక్కువ వేతనాలకే విదేశీయులను తెచ్చుకుంటూ స్థానిక అమెరికన్ ఉద్యోగుల పొట్ట కొడుతున్నాయని వాన్స్ ఘాటుగా విమర్శించారు. ప్రస్తుతం ఉన్న హెచ్1బీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని దానిని సరిచేయడం కంటే పూర్తిగా తొలగించడమే శ్రేయస్కరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఉపాధ్యక్షుడి స్థాయిలో ఉన్న ఒక అగ్రనేత ఇలా విదేశీ ఉద్యోగుల మనుగడనే ప్రశ్నించడం.. భవిష్యత్తుపై ఆధారపడిన భారతీయ నిపుణుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది.

**కన్నీటి సాగరంలో భారతీయ కుటుంబాలు..**

ప్రతి ఏడాది జారీ అయ్యే హెచ్1బీ వీసాల్లో సింహభాగం పొందేది మన భారతీయులే. తమ జీవిత సమయాన్నంతా గ్రీన్ కార్డు నిరీక్షణలోనే వెచ్చిస్తున్న లక్షలాది మంది భారతీయ ఉద్యోగుల పరిస్థితి ఇప్పుడు ప్రశ్నార్థకరంగా మారింది. పిల్లల చదువులు, స్థిరాస్తి రుణాలు, కుటుంబ భవిష్యత్తును అమెరికాలోనే ఊహించుకున్న దంపతులకు ఇది తీరని దిగ్భ్రాంతి. రూ. లక్షల విద్యా రుణాలు చేసి.. అమెరికాలో అడుగుపెట్టిన విద్యార్థులు, ఫ్రెషర్ల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది.

# సరిహద్దులు దాటిన ఆత్మబంధం.. గయ తీరంలో విదేశీయుల పిండప్రదానం..

కన్నప్రేమ.. కన్నవారి రుణం.. దేహాన్ని వదిలినా వీడని బంధం. మనల్ని ఈ భూమిపైకి తెచ్చి.. అడుగులు నేర్పిన పూర్వీకులను స్మరించుకోవడం కేవలం ఒక ఆచారం కాదు.. అది గుండెల లోతుల్లోంచి పొంగిపొర్లే కృతజ్ఞతా భావం.

కన్నప్రేమ.. కన్నవారి రుణం.. దేహాన్ని వదిలినా వీడని బంధం. మనల్ని ఈ భూమిపైకి తెచ్చి.. అడుగులు నేర్పిన పూర్వీకులను స్మరించుకోవడం కేవలం ఒక ఆచారం కాదు.. అది గుండెల లోతుల్లోంచి పొంగిపొర్లే కృతజ్ఞతా భావం. భారతీయుల రక్తంలోనే ముడిపడి ఉన్న ఈ పవిత్రమైన సంప్రదాయం.. ఇప్పుడు హృదయాలను కదిలిస్తూ ఖండాంతరాలు దాటింది. భావాలకు, ప్రేమానురాగాలకు ఏ సరిహద్దులూ అడ్డుకావని నిరూపిస్తూ.. బీహార్‌లోని పవిత్ర గయా క్షేత్రం ఒక అద్భుతమైన భావోద్వేగభరిత దృశ్యానికి వేదికైంది.జర్మనీ, ఘనా, ఉక్రెయిన్, రష్యా వంటి దూర తీరాల నుంచి వచ్చిన విదేశీయులు గయలోని ఫల్గుణీ నదీ తీరానికి చేరుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి చేతులు జోడించి, కళ్లు మూసుకుని తమ పూర్వీకులను తలచుకుంటూ వారు చేసిన ప్రార్థనలు అక్కడున్న వారి హృదయాలను ద్రవీభవింపజేశాయి. స్థానిక పండితులు మంత్రాలు చదువుతుంటే పూర్తి శ్రద్ధాభక్తులతో అర్ఘ్యం అర్పిస్తూ తర్పణాలు వదులుతూ పిండప్రదానం చేశారు. వారి కళ్లలో కనిపించిన ఆర్ద్రత, తమను విడిచివెళ్లిన పెద్దల పట్ల ఉన్న అమితమైన ఆరాధన అక్కడి ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పరవశింపజేసింది."ఇక్కడికి వచ్చాక మా గుండెల్లో ఏదో తెలియని ప్రశాంతత నిండింది" అంటూ ఉక్రెయిన్‌కు చెందిన ఒలెక్సాండ్రా ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. "మమ్మల్ని



సాకిన పూర్వీకులకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి వారి ఆత్మశాంతి కోసం ప్రార్థించడానికి ఇంతకంటే పవిత్రమైన మార్గం లేదనిపించింది. భారతదేశంలో లభించిన ఆప్యాయత, ఆధ్యాత్మిక అనుభూతి జీవితాంతం మా వెంట ఉండిపోతాయి" అని ఆమె పంచుకున్న మాటలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయి.మతం, భాష, దేశం, రంగు ఏదైనా కావచ్చు.. కానీ కన్నవారిని గౌరవించడం.. వారి జ్ఞాపకాలను గుండెల్లో పదిలపరుచుకోవడం అనే భావన మానవాళి అందరికీ ఒక్కటేనని ఈ ఘట్టం చాటిచెప్పింది. కేవలం ధ్యానం, యోగానే కాకుండా భారతీయ సనాతన సంప్రదాయాల్లోని మమతానురాగాలు, కుటుంబ బంధాల మూలాలు నేడు ప్రపంచాన్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ దృశ్యాలు చూసి "ప్రేమకు, ఆధ్యాత్మికతకు సరిహద్దులు లేవని నిరూపించారు" అంటూ నెటిజన్లు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు. ఇది కేవలం ఒక పూజా కార్యక్రమం కాదు.. మానవత్వానికి, సనాతన ధర్మ విశ్వవ్యాప్తతకు లభించిన ఒక అత్యున్నతమైన గౌరవం..

# దళపతికి డేంజర్ సిగ్నల్స్.. ప్రభుత్వం నడపడం అంతా ఈజీ కాదా!




తమిళనాడులో ముఖ్యమంత్రి దళపతి విజయ్ ప్రభుత్వానికి ఈ నెల 6న జరగనున్న ఉప ఎన్నికలు తొలి సవాల్ విసురుతున్నాయి. అన్నా డీఎంకే ఎమ్మెల్యేల రాజీనామాతో మధురాంతకం, ధరాపురం నియోజకవర్గాలకు మరో నాలుగు రోజుల్లో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో టీవీకే నేతలు భారీగా ఓట్లు కొనుగోలు చేస్తున్నారని మిత్రపక్షమైన సీపీఐ నుంచి ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. దీంతో ఇప్పటికే దినదిన గండంగా ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రి విజయ్ కి ఉప ఎన్నికల తర్వాత కూడా టెన్షన్ తగ్గే పరిస్థితి కనిపించడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్ లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 108 స్థానాలు గెలుచుకుని టీవీకే అధినేత, సినీ నటుడు దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వాన్ని నడపాల్సిన కనీస మెజార్టీ 118 స్థానాలు లేకపోవడంతో కాంగ్రెస్, వీసీకేతోపాటు కమ్యూనిస్టు పార్టీల మద్దతుతో విజయ్ ప్రభుత్వాన్ని నడపాల్సివస్తోందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏ క్షణంలోనైనా విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి. విజయ్ కి ఆరు నెలల సమయం ఇస్తామని, అంతవరకు వేచిచూస్తామని డీఎంకే అధినేత స్టాలిన్ ఇప్పటికే స్పష్టం చేశారు. స్టాలిన్ ఇచ్చిన గడువు సమయం సమీపిస్తుండగా, ముఖ్యమంత్రి విజయ్ ఇంకా రాజకీయంగా కుదరుకోలేని పరిస్థితులు కనిపిస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.ప్రస్తుతం మిత్రపక్షాల మద్దతుతో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి విజయ్ సొంతంగా బలం పెంచుకోవాలని వ్యూహాలు రచిస్తున్నా, ప్రతిపక్షాల ఐక్యతతో ఆ ఎత్తులు పనిచేయడం లేదని అంటున్నారు. ప్రభుత్వం సుస్థిరంగా ఉండాలంటే 118 స్థానాలు ఉండాల్సివుండగా, ప్రస్తుతం టీవీకే పార్టీకి 107 ఉన్నాయి. ఇంకా 11 మందిని ఇతర పార్టీల నుంచి రాజీనామా చేయించి గెలిపించుకోవాలని టీవీకే నేతలు భావిస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు. ఇందులో భాగంగా అన్నాడీఎంకే నుంచి ఇద్దరితో రాజీనామా చేయించారు. ఆ స్థానాలకే మరో నాలుగు రోజుల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు స్థానాలు గెలిచినా మరో 9 స్థానాలు అవసరం అవుతాయి. అయితే ప్రస్తుతం సహకరిస్తున్న మిత్రపక్షాలు తరచూ ప్రభుత్వాన్ని బెదిరించేలా మాట్లాడుతుండటమే విజయ్ సర్కార్ కు దినదిన గండంగా మారిందని అంటున్నారు.

కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ పార్టీతో స్వల్ప విభేదాలు తలెత్తగా, ప్రస్తుతం సీపీఐ నేతలు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకేపై కారాలు మిరియాలు నూరుతున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా మధురాంతకం ఉప ఎన్నికల్లో టీవీకే భారీగా డబ్బు ఖర్చు చేస్తోందని, దీంతో ఓటర్లు తమకు కూడా డబ్బులు అడుగుతున్నారని సీపీఐ నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేయమని అధికారంలోకి వచ్చిన టీవీకే ఇప్పుడు ఇలా మాట మార్చడమే కాకుండా, అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని సీపీఐ నేతలు ధ్వజమెత్తుతున్నారు. మిత్రపక్షమైన సీపీఐ ఈ స్థాయిలో విమర్శలు చేస్తుంటే, టీవీకే నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెబుతున్నారు. ఇక సీపీఐ మరింత తీవ్రంగా ఆలోచిస్తే విజయ్ ప్రభుత్వానికి ప్రమాద ఘంటికలు మోగినట్లేనని అంటున్నారు. మొత్తానికి మిత్రపక్షాలతో సమన్వయం చేసుకోవడంలో ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వం విఫలమవుతోందని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితులు చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

# 4 రోలెక్స్ వాచీల ధర 400 కోట్లు.. మన స్టార్లకు ఎందుకు అంత పిచ్చి?



లండన్‌లో జరిగిన ఒక ప్రతిష్టాత్మక ఛారిటీ వేలంలో నాలుగు రోలెక్స్ డేటోనా వాచీలు ఏకంగా 49.4 మిలియన్ డాలర్లు, అంటే భారతీయ కరెన్సీలో రూ.400 కోట్లకు పైగా ధర పలికి ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. అత్యంత విలాసవంతమైన.. అరుదైన ఈ వాచీలు అంతర్జాతీయ వాచ్ కలెక్టర్లను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఈ వేలం ద్వారా వచ్చిన భారీ మొత్తాన్ని ప్రముఖ సామాజిక, పర్యావరణ సంస్థలకు విరాళంగా అందిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.ఈ నాలుగు రోలెక్స్ వాచీలు వేర్వేరు ప్రత్యేకతలు.. అద్భుతమైన డిజైన్‌లతో రూపుదిద్దుకున్నాయి. వీటిలో -సమ్మర్- వాచీ ఎవర్‌రోజ్ గోల్డ్ .. టర్కాయిస్ మెటీరియల్స్‌తో తయారై 13.65 మిలియన్ డాలర్లు పలికింది. అలాగే -ఆటం- వాచీ ఎల్లో గోల్డ్ - ముకైట్ కాంబినేషన్‌తో 13.5 మిలియన్ డాలర్లను సొంతం చేసుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఇక మిగిలిన రెండు వాచీలలో -వింటర్-ఎడిషన్ ప్లాటినం - బ్లూ ఓపల్ డిజైన్‌తో కూడి 13.2 మిలియన్ డాలర్ల ధరను దక్కించుకుంది. అలాగే -స్ప్రింగ్- ఎడిషన్ వాచీ వైట్ గోల్డ్ మెటీరియల్‌తో రూపొంది 9 మిలియన్ డాలర్ల ధరను పలికింది. ఇలా ప్రకృతిలోని ప్రతి సీజన్‌ను ప్రతిబింబించేలా వీటిని అత్యంత నైపుణ్యంతో తీర్చిదిద్దడం ప్రధాన విశేషం.ఈ వేలం ద్వారా లభించిన మొత్తం భారీ నిధులను కేవలం విలాసాల కోసం కాకుండా సామాజిక- పర్యావరణ సేవలకు వినియోగిస్తున్నారు. ఈ మొత్తాన్ని టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ స్థాపించిన -రోజర్ ఫెదరర్ ఫౌండేషన్- అలాగే ప్రముఖ హాలీవుడ్ నటుడు లియోనార్డో డికాప్రియోకు చెందిన పర్యావరణ సంస్థ రీ-వైల్డ్‌కు విరాళంగా అందిస్తున్నారు. విలాసవంతమైన వస్తువుల విక్రయం ద్వారా వచ్చే సొమ్మును ఇలాంటి సత్కార్యాలకు ఉపయోగించడం పై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి.

**టాలీవుడ్ బాలీవుడ్ స్టార్లలో రోలెక్స్ క్రేజ్:**

అంతర్జాతీయ స్థాయిలో రోలెక్స్ వాచీలకు ఉన్న క్రెజ్ ఇలా ఉంటే.. మన టాలీవుడ్ - బాలీవుడ్ స్టార్ హీరోలు ద

కూడా రోలెక్స్ వాచీలపై ప్రత్యేక మమకారాన్ని కలిగి ఉన్నారు. కోట్లాది రూపాయల ఖరీదు చేసే లగ్జరీ వాచీలను ధరించడంలో మన టాలీవుడ్ స్టార్స్ రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు వంటి ప్రముఖులు ముందు వరుసలో ఉంటారు. వారి వద్ద ఉన్న ప్రత్యేకమైన, లిమిటెడ్ ఎడిషన్ రోలెక్స్ వాచీలు తరచూ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

ఇక బాలీవుడ్‌లో బాద్‌షా షారుక్ ఖాన్, రణ్‌వీర్ సింగ్, సల్మాన్ ఖాన్ వంటి అగ్ర నటులు అత్యంత ఖరీదైన.. అరుదైన రోలెక్స్ - ఇతర లగ్జరీ వాచీలను ఉపయోగిస్తుంటారు. కేవలం ఫ్యాషన్ స్టేట్‌మెంట్ మాత్రమే కాకుండా.. తమ హోదాకు తగినట్లుగా కోట్లాది రూపాయల విలువైన ఈ వాచీలను సేకరించడం ఈ స్టార్లకు అలవాటు. ఈ రకమైన అరుదైన వాచీల క్రేజ్.. వాటి వెనుక ఉన్న దాతృత్వ దృక్పథం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# సంస్థాగత సంక్షోభం!

ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో 14సార్లు అధికారికంగా వ్యక్తం చేసిన అభ్యంతరాలపై వచ్చిన కథనం.. సంస్థాగత సంక్షోభానికి తెరలేపింది. నిజానికి.. తెలివైన అధికారులు అయితే -మిగతా ఇద్దరు కమిషనర్లకు ఆమోదయోగ్యం కాని నిర్ణయాన్ని కేవలం తన ఉన్నత హోదాతోనే ముందుకు నెట్టేయరని ఎవరైనా ఊహిస్తారు. కానీ సరిగ్గా అదే జరిగిందని ఈసీ దిద్దుబాటు చర్యలూ స్పష్టం చేస్తున్నాయి. వివాదంపై తొలిసారిగా సెప్టెంబర్ 26న ముగ్గురు కమిషనర్లూ సమావేశమై ఒక ప్రెస్ నోట్ విడుదల చేశారు. తొమ్మిది నిర్ణయాలతో కూడిన ప్రకటన, ఎస్ఐఆర్, ఈసీఐనెట్, ఓటర్ల నమోదుకు సంబంధించిన కొన్ని అంశాలను పరిష్కరిస్తున్నట్టు కనిపించినా, అంతర్గత విభేదాలు లేవనెత్తిన కీలక ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. తప్పుడు పాజిటివ్‌ల రేటు అత్యధికంగా ఉన్న, 13 కోట్ల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించిన ఈసీఐ స్క్రీనింగ్ సాంకేతికతకు బాధ్యులెవరన్న ప్రశ్నకూ జవాబు లేదు. విచిత్రమేమిటంటే, బాధిత కమిషనర్లు ఇద్దరూ తమ ఫిర్యాదుల పరిష్కారం కోసం రాష్ట్రపతిని ఎప్పుడూ సంప్రదించలేదు. ఇది ఈసీఐ అంతర్గత ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై నమ్మకం లేకపోవడాన్ని ప్రతిబింబిస్తుంది, లేదా ప్రభుత్వం నుంచి నిత్య స్వతంత్రతను కాపాడుకునే స్ఫూర్తి ఈసీఐలో లోపించడాన్ని తేటతెల్లం చేస్తోంది. సెప్టెంబర్ 26 నాటి ప్రెస్ నోట్ ప్రకారం, ఈసీఐ సిబ్బంది తమను పట్టించుకోవడం లేదంటూ వారు క్యాబినెట్ కార్యదర్శిని సంప్రదించారు.

ఆదర్శవంతంగా చూస్తే, కమిషన్ నిర్ణయాలు ఏకగ్రీవంగా ఉండాలి. విభేదం ఏర్పడినప్పుడు, రెండు వర్సెస్ ఒకటి అనే సాధారణ మెజారిటీ చట్టపరంగా సరిపోతుంది. సీఈసీ కమిషన్‌కు అధ్యక్షత వహిస్తారు కాబట్టి, సిబ్బందిని క్రమశిక్షణలో ఉంచే పరిపాలనా బాధ్యత ప్రధానంగా ఆయనపైనే ఉంటుంది. కమిషన్‌లో సాధ్యమయ్యే తిరిగిరాని చీలిక, పరస్పర నమ్మక లోపం కారణంగా ఈసీఐ సమర్థవంతంగా పనిచేయలేని స్థితికి చేరుకుందా? అలాంటప్పుడు దాని కార్యాచరణకు భవిష్యత్ ఏమిటి? ఈసీఐ ఎవరికి జవాబుదారీగా ఉంటుంది? తనను నియమించిన ప్రభుత్వానికి, ముగ్గురు కమిషనర్లలో ఎవరినైనా తొలగించాలంటే అవసరమైన పార్లమెంటు ఆమోదానికి జవాబుదారీగా ఉంటుంది. కమిషన్‌ను నియమించేది ఎవరు? ప్రధానమంత్రి, ఒక కేంద్ర మంత్రి ప్రాతినిధ్యం వహించే కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్ష నేత ప్రాతినిధ్యం వహించే పార్లమెంటుతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీయే నియామకాలు చేస్తుంది. దీనివల్ల నియామకాల్లో ప్రభుత్వానిదే పైచేయి అవుతుంది. పారదర్శకత కోసం, ఈ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చడం సముచితమే అవుతుంది. రెండు ప్రధాన లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటిది, నియామక ప్రక్రియ కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై అతిగా ఆధారపడి ఉంది. నియమితులైన కమిషనర్లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి హోదా ఉన్నప్పటికీ, భారత ప్రధాన న్యాయమూర్తి కూడా ఎంపిక కమిటీలో సభ్యుడు కాదు. రెండోది, పదవీ విరమణ పొందిన బ్యూరోక్రాట్లతో కమిషన్‌ను నింపడం ఇకపై కమిషన్ రాజకీయాకరణకు వ్యతిరేకంగా రక్షణ కవచంగా పనిచేయడం లేదు.

సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి కొన్ని మార్పులు సహాయపడగలవు. మొదటిది, ఈసీఐకి, ప్రభుత్వానికి మధ్య సంస్థాగత సంబంధాన్ని తొలగించి, దాన్ని పార్లమెంటు పరిధిలోకి తీసుకురావడం. పార్లమెంటులోని అన్ని పార్టీల దామాషా ప్రాతినిధ్యాన్ని ప్రతిబింబించే ఒక సాధికారిక ఎన్నికల సంయుక్త పార్లమెంటరీ కమిటీ (ఈజేపీసీఈ) ద్వారా ఈసీఐ కమిషనర్ల నియామక బాధ్యత నిర్వహించాలి. రెండోది, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు ఉన్నంత స్వతంత్రతను ఇవ్వడానికి, ఈసీఐ వ్యయాలను భారత సంఘటిత నిధి నుంచి చెల్లించాలి. మూడోది, రాష్ట్ర శాసనసభల్లో, ఈసీఐ తరహాలోనే రూపొందించిన సాధికారిక ఎన్నికల కమిటీలు ప్రతి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని, అధీన జిల్లా, బ్లాక్‌స్థాయి యంత్రాంగాలను ఎంపిక చేయాలి. రాజకీయ సంస్థలను వృత్తిపరంగా తీర్చిదిద్దడం, కేంద్ర-రాష్ట్ర స్థాయి ఎన్నికల సంస్థల్లో ఒక ఉమ్మడి సంస్థాగత సంస్కృతిని అభివృద్ధి చేయడమే ఈ ప్రతిపాదనల వెనుక ఉన్న ప్రధాన ఆలోచన. ఈసీఐలో అసలైన సమస్య ఏమిటి? మొదటిది, పనితీరులో పారదర్శకత లేకపోవడం, ఇది "వెనుక తలుపు" నిర్వహణ ఆరోపణలకు విశ్వసనీయతను ఇస్తోంది. రెండోది, ఓటర్ల జాబితాను అల్గారిథమ్ స్క్రీనింగ్ చేయడానికి తొందరపడటం ఒక హెచ్చరికగా నిలిచింది, జాగ్రత్తగా శిక్షణ ఇవ్వకపోతే డిజిటల్ ఏజెంట్లు అదుపు తప్పుతాయి. దీనికి బాధ్యులెవరో నిర్ధారించి, అధికారికంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. తప్పుగా మినహాయించబడిన వారికి పరిహారంగా చెల్లించాల్సిన వ్యయం కూడా ఉంది. 13 కోట్ల మినహాయింపుల్లో 50 శాతం తప్పుగా జరిగాయని అనుకుంటే, సంభావ్య జాతీయ బాధ్యత రూ.3,770 కోట్లు అవుతుంది. ఇది ఈసీఐ వార్షిక బడ్జెట్ కంటే ఎక్కువ. ప్రత్యామ్నాయంగా, అల్గారిథమ్ మినహాయింపులన్నింటినీ భౌతికంగా ధృవీకరించడం, తప్పుగా మినహాయించబడిన వారిని పునరుద్ధరించడం, వారి ఇళ్లకే ఓటరు కార్డును, లిఖితపూర్వక క్షమాపణతో సహా అందించడం ద్వారా.. సమర్థవంతమైన, సమ్మిళిత జాతీయ సంస్థగా తన విశ్వసనీయతకు జరిగిన హానిని ఈసీఐ సరిదిద్దుకోగలదు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజల నమ్మకమే అసలైన పునాది. కమిషన్ లోపలే ఏకాభిప్రాయం కుదరని పక్షంలో, బయట ప్రజలు ఆ సంస్థ నిర్ణయాలను ఎలా విశ్వసించగలరు? కమిషనర్ల మధ్య నెలకొన్న అపనమ్మకం బహిరంగమైనప్పుడు, అది కేవలం వారి వ్యక్తిగత సంబంధాలకే పరిమితం కాదు, యావత్ ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతకే సవాలుగా మారుతుంది. ఇలాంటి సంక్షోభ సమయాల్లో మౌనం, అర్ధసత్యాలతో కూడిన ప్రెస్ నోట్లు పరిస్థితిని మరింత జటిలం చేస్తాయే తప్ప పరిష్కరించవు. కాబట్టి, ఈసీఐ తక్షణం చేయాల్సింది.. అంతర్గత విభేదాలను పారదర్శకంగా అంగీకరించడం, స్క్రీనింగ్ సాంకేతికత లోపాలకు బాధ్యత వహించడం, బాధితులకు న్యాయం చేయడం. దీర్ఘకాలికంగా, పైన ప్రతిపాదించిన సంస్థాగత సంస్కరణలు మాత్రమే ఈసీఐని ప్రభుత్వ ప్రభావం నుంచి నిజమైన స్వతంత్రతతో, జవాబుదారీతనంతో ముందుకు నడిపించగలవు. లేకుంటే, ఇలాంటి వివాదాలు పదేపదే పునరావృతమై, భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఈ సంస్థ విశ్వసనీయతనే కోల్పోయే ప్రమాదం ఉంది.

## పనికొచ్చే పలుకు



# అదే వెలకట్టలేని అసలు సంపద

ఇన్‌స్టా ఓపెన్ చేయగానే కనిపించేదేంటి? కొత్త కారు కొన్నవాళ్లు, విదేశాల్లో విహారయాత్రలు చేస్తున్నవాళ్లు, బ్రాండెడ్ షూస్ ఫ్లాంట్ చేసేవాళ్లు. ఈ "హైలైట్ రీల్" చూస్తూ, "వీళ్లు లైఫ్‌లో సెటిల్ అయిపోయారు, నేనేమో వెనకబడిపోతున్నాను" అని ఫీలవుతుంటాం. కానీ ఆ ఫీడ్‌లో ఎప్పుడూ కనిపించనిదేంటో తెలుసా? రాత్రి ప్రశాంతంగా నిద్రపోగలగడం. ఒత్తిడి లేకుండా ఇంట్లోకెళ్లడం. నిజంగా తమ కోసం ఎదురుచూసే మనుషులుండటం. ఇవేవీ ఫోటో తీసి పోస్ట్ చేయలేం, కానీ ఇవే అసలైన సంపదలు.

మన తరం "రిచ్" అంటే బ్యాంక్ బ్యాలెన్స్, బ్రాండ్లు, ఫాలోయర్స్ కౌంట్ అనుకుంటుంది. కానీ వయసు పెరిగే కొద్దీ, జీవితం అనుభవాలతో నిండుకున్న కొద్దీ, ఒక సత్యం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రశాంతమైన ఇల్లు, ఆరోగ్యకరమైన శరీరం, అర్థవంతమైన పని, ప్రేమించే మనుషులు.. ఇవే నిజమైన సంపదలు. ఒక సింపుల్ లాజిక్ ఆలోచించండి. మీ దగ్గర కోట్లున్నా, రాత్రిళ్లు యాంగ్జైటీతో నిద్రపట్టకపోతే ఆ డబ్బు ఉపయోగమేంటి? అత్యాధునిక జిమ్‌కు మెంబర్‌షిప్ తీసుకున్నా, శరీరం రోజూ అలసటగా, అనారోగ్యంగా ఉంటే ఆ మెంబర్‌షిప్ దేనికి? లక్షల జీతం వచ్చే జాబ్ ఉన్నా, ప్రతిరోజూ ఆ పని మిమ్మల్ని లోపలే ఖాళీగా చేస్తుంటే అది నిజంగా "సక్సెస్సా"? చివరికి, పార్టీల్లో వందమంది చుట్టూవున్నా, నిజంగా మీ బాధను అర్థం చేసుకునే ఒక్కరూ లేకపోతే, క్రౌడ్ ప్రయోజనమేంటి?

కొత్త ఫోన్ కొన్నప్పుడు, కొత్త బట్టలు వేసుకున్నప్పుడు మనకు కలిగే సంతోషం నిజమే, కానీ అది ఎంతసేపు ఉంటుంది? రెండు రోజులు, వారం? దీన్నే సైకాలజిస్టులు "హెడోనిక్ అడాప్టేషన్" అంటారు. ఎంత కొత్తది వచ్చినా, కొన్నాళ్లకు అది మనకు మామూలుగా అయిపోతుంది, మళ్లీ ఇంకేదో కావాలనిపిస్తుంది. ఇది ఒక ఎండ్‌లెస్ లూప్. ఎప్పటికీ "ఇంకొంచెం ఉంటే బాగుండు" అనే ఫీలింగ్‌లోనే ఉండిపోతాం. కానీ ప్రశాంతమైన మనసు, మంచి ఆరోగ్యం, నిజమైన బంధాలు.. ఇవి ఇలా పని చేయవు. వీటి విలువ కాలం గడిచే కొద్దీ తగ్గదు, పెరుగుతుంది. ఒక మంచి స్నేహితుడితో గడిపిన సాయంత్రం, ఒక ఏడాది తర్వాత కూడా అదే వెచ్చదనాన్ని గుర్తు చేస్తుంది. కానీ ఏడాది క్రితం కొన్న ఫోన్ ఇప్పుడు "అవుట్‌డేటెడ్"గా అనిపిస్తుంది.

ఈ ఆలోచనను అర్థం చేసుకోవడం ఒక ఎత్తు, దాన్ని రోజువారీ జీవితంలో అమలు చేయడం మరో ఎత్తు. ముందుగా, మీ టైమ్‌ను ఎక్కడ ఖర్చు చేస్తున్నారో గమనించండి. గంటల తరబడి స్క్రోలింగ్‌లో టైమ్ పోతుంటే, అదే టైమ్‌లో ఇంట్లో వాళ్లతో మాట్లాడటం, వాకింగ్‌కు వెళ్లడం, ఒక పుస్తకం చదవడం లాంటివి ట్రై చేయండి. రెండోది, మీ శరీరాన్ని నిర్లక్ష్యం చేయకండి. జంక్ ఫుడ్, నిద్రలేమి, నిరంతర స్క్రీన్ టైమ్.. ఇవి చిన్న వయసులో పెద్దగా కనిపించకపోయినా, దీర్ఘకాలంలో మీ శక్తిని తినేస్తాయి. మూడోది, "పని" అంటే కేవలం జీతం కోసం చేసేది కాదు, దానికి అర్థం ఉండాలి. మీరు చేసే పని మీకు నచ్చకపోతే, దాన్ని మార్చుకునే ధైర్యం చేయండి లేదా దానిలో మీకు నచ్చే కోణాన్ని వెతుక్కోండి. నాలుగోది, బంధాలపై పెట్టుబడి పెట్టండి. ఫ్రెండ్స్‌తో, ఫ్యామిలీతో టైమ్ స్పెండ్ చేయడం "వేస్ట్ ఆఫ్ టైమ్" కాదు, అది మీ మానసిక ఆరోగ్యానికి ఇన్వెస్ట్‌మెంట్.

డబ్బు సంపాదించడం తప్పు కాదు, భౌతిక వస్తువులు కొనడమూ తప్పు కాదు. సమస్య ఏంటంటే, వాటినే జీవితానికి అంతిమ లక్ష్యంగా చేసుకోవడం. ఒక ఇల్లు కొనగలం, కానీ ఇంట్లో ప్రశాంతతను కొనలేం. ఖరీదైన సప్లిమెంట్లు కొనగలం కానీ నిజమైన ఆరోగ్యాన్ని కొనలేం. వెనక్కి తిరిగి చూస్తే.. ఎంతమందితో నిజమైన బంధాలు పెంచుకున్నాం, ఎంత ప్రశాంతంగా జీవించామన్నదే కనిపించాలి. అవే నిజమైన ఆస్తిపాస్తులు.

# భయానక రుతుపవన కాటు!



రుతుపవనాలకు ముందు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఏప్రిల్, మే నెలల్లో రెండు అంచనాలను విడుదల చేస్తుంది. ఈ రెండూ, పొడి రుతుపవనాలనే స్పష్టంగా సూచించాయి. అప్పటికే ఇప్పటివరకూ చూసిన బలమైన ఎల్ నినోల్లో ఒకటి రాబోతోందన్న ప్రపంచవ్యాప్త ఏకాభిప్రాయం ఈ అంచనాకు మరింత విశ్వసనీయతను తెచ్చిపెట్టింది. దీంతో ఎదురైన ప్రశ్న.. "ఎంత పరిమాణంలో లోటు ఉంటుంది?" అన్నదే. సెప్టెంబర్ 30న భారత రుతుపవన గణాంకాలు ముగిసేనాటికి, దేశవ్యాప్తంగా 759.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఇది సాధారణ 868.6 మిల్లీమీటర్లలో 87 శాతమేనని ఐఎండీ ప్రకటించింది. అంటే సుమారు 13 శాతం వర్షపాత లోటు. ఇది 2015 తర్వాత అత్యంత తీవ్రమైన రుతుపవన లోటుగా, 2001 తర్వాత నాలుగో అత్యల్ప వర్షపాతంగా, 1901 తర్వాత 13వ అత్యల్పంగా నమోదైంది. ఐఎండీ అంచనా అయితే "సాధారణం కంటే తక్కువ" (90 నుంచి 95 శాతం సగటు వర్షపాతం) అని సూచించింది. ఇది జాగ్రత్తగా వేసిన అంచనాగా తేలింది. దీని మోడళ్లు "లోటు" (90 శాతం కంటే తక్కువ) వర్షపాతాన్ని సూచిస్తున్నప్పటికీ, ఐఎండీ ఈ విధంగా జాగ్రత్తగా అంచనా వేయడం ఆశ్చర్యకరం. సెంట్రల్ ఈక్వటోరియల్ పసిఫిక్ వేడెక్కి రుతుపవన వర్షాలను అణచివేసే ఎల్ నినో సంవత్సరాల్లో, లోటు పరిమాణాన్ని అంచనా వేయడం సవాలుతో కూడుకున్నది కాబట్టి, వాతావరణ శాఖ సామర్థ్యాన్ని ఇవి పరీక్షిస్తాయి. "లోటు" అని హెచ్చరించి, కచ్చితత్వాన్ని క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఏజెన్సీ ఎందుకు "సాధారణం కంటే తక్కువ" అనే ఎంపిక చేసుకుందో అర్థం కాని విషయం. ప్రస్తుతానికి, తుది సంఖ్య 4-5 శాతం దోష పరిధిలోనే ఉంది కాబట్టి, ఐఎండీ కేవలం సాంకేతిక విజయాన్నే క్లెయిమ్ చేసుకోగలదు.

అయితే, విభజించి చూస్తే, పరిమాణాన్ని సరిగ్గా అంచనా వేయడంలో ఐఎండీ ఎదుర్కొన్న ఇబ్బంది మరింత స్పష్టంగా కనిపిస్తుంది. జూన్‌లో సాధారణ వర్షపాతంలో కేవలం 65 శాతం మాత్రమే నమోదైంది. 92 శాతం అంచనా కంటే ఇది చాలా పొడిగా ఉంది. 94 శాతం కంటే తక్కువగా ఉంటుందని భావించిన జులైలో, చివరికి ఒక శాతం పాయింట్ ఎక్కువ వర్షం కురిసింది (101 శాతం). ఆగస్టు దీర్ఘకాలిక సగటులో 84 శాతంగా నమోదై, "94 శాతం కంటే తక్కువ" అన్న అంచనాకు అనుగుణంగానే ఉంది. 92 శాతంతో ముగిసిన సెప్టెంబర్, "91 శాతం కంటే తక్కువ" అన్న అంచనా కంటే కొంచెం ఎక్కువగా నమోదైంది. ఈశాన్య ప్రాంతంలో "సాధారణ" రుతుపవనాన్ని ఐఎండీ ఆశించగా, అది 1901 తర్వాత అత్యంత పొడిగా, అంటే 26 శాతం లోటుతో నమోదైంది. తూర్పు, ఈశాన్య భారత్‌లో 1,017 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, ఇది 1901 తర్వాత అత్యల్పం. దక్షిణ ద్వీపకల్పం 23 శాతం లోటుతో నడిచింది, 542 మిల్లీమీటర్లతో 1901 తర్వాత నాలుగో అత్యల్పంగా, 2001 తర్వాత రెండో అత్యల్పంగా నిలిచింది. సాధారణం కంటే తక్కువగా అంచనా వేసిన మధ్య, వాయవ్య భారత్ మాత్రం సముద్ర పరిస్థితులు, పశ్చిమ అవాంతరాల కారణంగా అంచనాలకు దగ్గరగానే ముగిసింది. వాయవ్య భారత్ సగటు కంటే 117 శాతం వర్షపాతం అందుకుంది, ఎనిమిది పశ్చిమ అవాంతరాల మద్దతుతో. వాతావరణ మార్పు దీన్ని మరింత సంక్లిష్టం చేస్తోంది. ఉష్ణమండల వర్షాలను మోసుకొచ్చే వ్యవస్థలైన పశ్చిమ అవాంతరాలు, రుతుపవన మాసాల్లో భారత్‌కు మరింత వర్షాన్ని తీసుకువస్తుండగా, దక్షిణ భారత్ మాత్రం ఎల్ నినో ప్రేరిత అస్థిరతకు మరింత హాని కలిగేలా కనిపిస్తోంది.

ఇది ఖరీఫ్ సాగులోనూ ప్రతిబింబించింది. జులై 10నాటికి, ఖరీఫ్ సాగు గత ఏడాది కంటే 16 శాతం వెనుకబడి ఉండగా, సెప్టెంబర్ ప్రారంభనాటికి ఆ అంతరం 2 శాతం కంటే తక్కువకు కుదించుకుపోయింది. కర్ణాటక వంద మండలాలకు పైగా, మహారాష్ట్ర 358లో 265 తాలూకాల్లో కరవును ప్రకటించాయి. అయితే జాతీయ లోటు సుమారు 12 శాతంగా ఉండటం వల్ల, 'వ్యవసాయ కరవు'కు కేంద్రం నిర్దేశించిన 20 శాతం పరిమితి కంటే ఇది తక్కువగానే ఉంది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ ఎల్ నినో మరింత బలపడి, దేశంలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని తీసుకురావచ్చని ఐఎండీ అంచనా వేస్తోంది. ఇది నేల తేమను, జలాశయాల పునఃనింపును ప్రమాదంలో పడేస్తుంది. నవంబర్‌లో ఎల్ నినో గరిష్ఠ స్థాయికి చేరుకోనుందని, అక్టోబర్ వర్షపాతం కూడా సాధారణం కంటే తక్కువగానే ఉండే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తూ, కేంద్ర మంత్రివర్గం గోధుమ మద్దతు ధరను క్వింటాలుకు రూ.25, ఆవాల మద్దతు ధరను రూ.413 మేర పెంచింది. ఐఎండీ అంచనాల పర్యవసానాలను దృష్టిలో ఉంచుకుని, ఈ సంస్థ తన ఉప-ప్రాంతీయ అంచనా వ్యవస్థలను మెరుగుపరచుకోవాలి, అవసరమైతే ప్రమాదకర వార్తలను తెలియజేయడానికి వెనుకాడకూడదు.

జాగ్రత్తగా ఉండే ధోరణి సాంకేతిక కచ్చితత్వాన్ని కాపాడుకోవడానికి సహాయపడవచ్చు, కానీ రైతులు, విధాన నిర్ణేతలు, నీటి నిర్వహణ అధికారులు ముందస్తు ప్రణాళిక వేసుకోవడానికి అవసరమైన నిజమైన హెచ్చరికను ఇది అందించకపోవచ్చు. లోటు పరిమాణాన్ని సరిగ్గా, సకాలంలో అంచనా వేయడంలో విఫలమైతే, దాని పర్యవసానాలు కేవలం గణాంకాల్లో మాత్రమే కాదు, పంట పొలాల్లో, రైతుల జీవనోపాధిలోనూ ప్రతిఫలిస్తాయి. ఒక రైతు, "సాధారణం కంటే కొంచెం తక్కువ" అన్న అంచనాను నమ్మి విత్తనాలు వేస్తే, వాస్తవంగా "తీవ్ర లోటు" ఎదురైనప్పుడు అతడికి కలిగే నష్టం భర్తీ చేయలేనిదిగా మారుతుంది. నీటిపారుదల శాఖలు, జలాశయాల నిర్వహణ సంస్థలు కూడా ఇదే అంచనాల ఆధారంగా తమ రిజర్వాయర్ల నిర్వహణ ప్రణాళికలను రూపొందిస్తాయి. జాగ్రత్తగా వేసిన అంచనా, వాస్తవ పరిస్థితి కంటే తేలికపాటిదిగా అనిపిస్తే, నీటి నిల్వల నిర్వహణలో తీవ్రమైన తప్పిదాలకు దారితీయవచ్చు. బీమా సంస్థలు, పంట బీమా పథకాలు కూడా ఈ అంచనాలనే ప్రాతిపదికగా తీసుకుంటాయి కాబట్టి, సరికాని సూచనలు క్లెయిమ్‌ల అంచనాలను, ప్రీమియం లెక్కలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉంది. వాతావరణ మార్పు కారణంగా రుతుపవనాల తీరు మరింత అనూహ్యంగా మారుతున్న ఈ కాలంలో, కేవలం జాతీయ సగటు సంఖ్యలపైనే ఆధారపడకుండా, జిల్లా, మండల స్థాయి వరకూ విశదీకరించిన అంచనాలను అందించడం ఐఎండీకి అత్యవసరంగా మారింది. దక్షిణ ద్వీపకల్పం, ఈశాన్య ప్రాంతాల్లో పదేపదే కనిపిస్తున్న తీవ్ర లోటు ధోరణిని ప్రత్యేక అధ్యయనాంశంగా తీసుకుని, ఈ ప్రాంతాలకు ప్రత్యేక హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఉంది. చివరిగా, శాస్త్రీయ సంస్థలుగా వాతావరణ శాఖలు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే, రాజకీయంగా అసౌకర్యంగా అనిపించినా, వాస్తవాన్ని యథాతథంగా చెప్పే ధైర్యం చూపించాల్సిందే. ఎందుకంటే సాంకేతిక కచ్చితత్వం కంటే, ఆచరణాత్మక ఉపయోగితే చివరికి ప్రజలకు నిజమైన సేవ చేస్తుంది!! ■



కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ దృఢంగా, బలంగా ఉండాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు వారికి సురక్షితమైన పని వాతావరణం, ఆదుకునే కుటుంబం, మానసిక వైద్య సేవలు, ఆర్థిక భద్రత, తగిన విశ్రాంతి లేదా జడ్జ్ చేయకుండా వినే ఒక మంచి మనిషి తోడు మాత్రమే కావాలి. మానసిక ఆరోగ్యం వ్యక్తిగతమైనదే అయినప్పటికీ, అది మన చుట్టూ ఉన్న సమాజం, వాతావరణం పైనా ఆధారపడి ఉంటుంది. మనిషి లోపల బలం లేక కాదు కుప్పకూలేది, కొన్నిసార్లు చుట్టూ అతడిని పట్టుకునే చేతులే లేకపోవడం వల్ల. అందుకే ఎవరినైనా "బలంగా ఉండు" అనడం కంటే, "నేనున్నాను" అని చెప్పడమే నిజమైన సాయం.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# లగ్జరీ ఫ్లైట్‌లో వాటర్‌ఫాల్!




దుబాయ్ నుంచి ఇస్తాంబుల్ వెళ్తున్న ఎమిరేట్స్ విమానంలో ప్రయాణికులు ఊహించని 'షవర్' అనుభవించారు! సీలింగ్ నుంచి ఒక్కసారిగా నీళ్లు ధారలా కారడం మొదలవగా, కొందరు దుప్పట్లతో తలదాచుకుంటే, మరికొందరు ఫోన్లు తీసి వీడియో తీసుకున్నారు. "జలపాతంలా తడిసిపోయా" అని ఒక ప్రయాణికురాలు చెప్పగా, "ప్రపంచంలోనే అత్యుత్తమ ఎయిర్‌లైన్ అనుకున్నా, ఇప్పుడు నా అభిప్రాయమే మారిపోయింది" అని మరొకరు వాపోయారు. ఏసీ కండెన్సేషన్ వల్లే ఇలా జరిగిందని అనుమానిస్తున్నా, సంస్థ మాత్రం అధికారికంగా కారణం వెల్లడించలేదు. సీట్లు తడిసిన ప్రయాణికులను వేరే చోట కూర్చోబెట్టి, 'అసౌకర్యానికి క్షమాపణ' చెప్పి సరిపెట్టేసింది.

# ఆహార నిద్ర

నిద్రలేమి రకరకాల జబ్బులకు దారితీస్తుంది. అందువల్ల కంటి నిండా నిద్ర పట్టేలా చూసుకోవటం తప్పనిసరి. మరి మంచి నిద్ర కావాలంటే? ఆహార అలవాట్లను మార్చుకొని చూడండి. అవును, మన ఆహార అలవాట్లు.. తినే తిండిలోని పోషకాలు, కొవ్వులు, చక్కెర, పీచు వంటివన్నీ నిద్ర తీరుతెన్నుల్లో పాలు పంచుకుంటాయి మరి. కొందరు పడుకోగానే వెంటనే నిద్రలోకి జారుకుంటారు. కొందరికి ఎంత ప్రయత్నించినా ఒక పట్టాన నిద్ర పట్టదు. కొందరు చిన్న అలికిడికే మేల్కొంటే మరికొందరు పెద్ద చప్పుళ్లయినా గాఢంగా నిద్రపోతుంటారు. నిద్ర విషయంలో రకరకాల అంశాలు పాలు పంచుకుంటాయి. వీటిల్లో ఆహార అలవాట్లూ ఒకటి. పడుకునే ముందు కడుపు నిండా తినటం వంటివి నిద్రకు భంగం కలిగిస్తే.. అరటిపండు తింటే కమ్మటి నిద్రకు దోహదం చేస్తుంది. అలాంటి కొన్ని జాగ్రత్తలు ఇవిగో..

**సాయంత్రం వేళ కెఫీన్‌కు దూరం**

మగతను వదిలించుకోవటానికో, ఉత్సాహంగా ఉండటానికో చాలామంది కాఫీ, టీ తాగేస్తూనే ఉంటారు. కానీ, వీటిల్లోని కెఫీన్ నిద్ర మీద ప్రభావం చూపుతుందనే విషయం మీకు తెలుసా? అడినోసిన్ అనే రసాయనాన్ని అడ్డుకోవటం ద్వారా కెఫీన్ అప్రమత్తంగా ఉండేలా చూస్తుంది. అసలు విషయం ఏంటంటే పగటిపూట ఒంట్లో పేరుకుపోయే అడినోసిన్ రాత్రిపూట నిద్ర వచ్చేలా చేస్తుంది. కెఫీన్ దీన్ని అడ్డుకోవటం వల్ల రాత్రి నిద్ర పట్టటం కష్టమవుతుంది. కెఫీన్ ప్రభావం సుమారు ఆరు గంటల వరకూ ఉంటుంది. అంటే సాయంత్రం 5 గంటలకు కాఫీ, టీ తాగితే దాని ప్రభావం రాత్రి 11 గంటల వరకు ఉంటుందన్నమాట. ఇది రాత్రి నిద్ర తగ్గేలా చేస్తుంది. పడుకోవటానికి ఆరు గంటల ముందు 400 మి.గ్రా. కెఫీన్ తీసుకున్నవారిలో మొత్తంగా గంట నిద్ర తగ్గుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

కాబట్టి నిద్ర పట్టక సతమతమయ్యేవారు సాయంత్రం వేళల్లో కెఫీన్‌తో కూడిన టీ, కాఫీ, కూల్‌డ్రింకుల వంటివి తాగకపోవటం మంచిది.

**ట్రిప్టోఫాన్ వరం**

కంటి నిండా నిద్ర పట్టటానికి ట్రిప్టోఫాన్ బాగా ఉపయోగపడుతుంది. ఇదొక అమైనో ఆమ్లం. ఆహారం నుంచి లభించే ఇది మెదడులో సెరటోనిన్, మెలటోనిన్‌గా మారుతుంది. ఈ రసాయనాలు నిద్రలో కీలక పాత్ర పోషిస్తాయి. త్వరగా నిద్ర పట్టడానికే కాకుండా రాత్రంతా గాఢంగా నిద్రపోవటానికీ మెలటోనిన్ తోడ్పడుతుంది. మనకు ఆనందం, సంతోషం కలగటానికి దోహదం చేసే సెరటోనిన్ నిద్ర–మెలకువల తీరునూ నియంత్రిస్తుంది.

అరటిపండు, బాదం, జీడిపప్పు, పిస్తా, బార్లీ, దంపుడు బియ్యం, చియా గింజలు, పప్పులు, గుమ్మడి విత్తనాలు, సాల్మన్ చేపలు, టోఫు, అక్రోట్లు, పాలు, పెరుగు, గుడ్డు తెల్లసొన వంటి వాటి నుంచి ట్రిప్టోఫాన్ దండిగా లభిస్తుంది. అలాగని ఇవి వెంటనే నిద్ర ముంచుకొచ్చేలా చేస్తాయని కాదు. వీటిని ఆహారంలో ఒక భాగం చేసుకుంటే క్రమంగా మంచి ఫలితం కనిపిస్తుందన్న మాట.

**పండ్లు, కూరగాయల మేలు**

నిద్ర బాగా పట్టేలా చూసుకునే మార్గాల్లో ఒకటి పండ్లు, కూరగాయలు మరింత ఎక్కువగా తినటం. వీటిల్లో సెరటోనిన్, మెలటోనిన్‌తో పాటు మెగ్నీషియం, విటమిన్ బి6, ఫోలేట్ వంటి సూక్ష్మ పోషకాలూ దండిగా ఉంటాయి. ఇవన్నీ నిద్ర బాగా పట్టటానికి తోడ్పడేవే. వీటితో పీచు కూడా దండిగా లభిస్తుంది. అధిక పీచుతో కూడిన ఆహారం తీసుకునేవారు మరింత గాఢంగా నిద్ర పోతున్నట్టూ పరిశోధనలు చెబుతున్నాయి. బాగా శుద్ధి చేసిన పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకున్న స్త్రీలు నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. అందువల్ల ఆహార ఉత్పత్తులు, తీపి పదార్థాలు, పానీయాలకు బదులు ఇలాంటి సహజ పదార్థాలు తీసుకోవటం మంచిది.

అరటిపండ్లు, చెర్రీ, అనాస, పాలకూర, టమోటాల్లో పీచు, సంక్లిష్ట పిండి పదార్థాలు, సెరటోనిన్, మెలటోనిన్, మెగ్నీషియం, విటమిన్ బి6 వంటివి దండిగా ఉంటాయి.



**నిద్రకు ముందు మద్యం వద్దు**

కొంతమంది రాత్రిపూట మద్యం తాగితే మంచి నిద్ర పడుతుందని భావిస్తుంటారు. కానీ, దీంతో ముంచుకొచ్చే మత్తు తాత్కాలికమే. మద్యం మొదట్లో మత్తును కలిగించినా ఆ తర్వాత నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. మధ్యలో మెలకువ వచ్చేలా చేస్తుంది. ఇలా గాఢ నిద్రకు భంగం కలిగిస్తుంది.

ఒకవేళ అంతగా అలవాటుంటే పడుకోవటానికి ముందు తాగకుండా చూసుకోవాలి. పడుకునే వేళకు శరీరంలోంచి దీని ప్రభావం తొలగిపోయేంత సమయం ఇవ్వాలి. మద్యంతో నిద్ర దెబ్బతింటున్నట్టు ఇప్పటికే గమనిస్తే మోతాదును తగ్గించుకోవటానికైనా ప్రయత్నించాలి. అంటే మద్యం అలవాటును మొత్తంగా మానెయ్యటం సాధ్యం కాకపోతే తాగే సమయం, మోతాదులనైనా మార్చుకోవటం మంచిదన్నమాట.

**కడుపు కాస్త ఖాళీగా..**

పడుకునే ముందు కడుపు నిండా తింటే నిద్రకు భంగం కలిగే అవకాశముంది. రాత్రిపూట జీర్ణక్రియ మందగిస్తుంది మరి. పడుకునేముందు ఎక్కువగా తింటే సరిగా జీర్ణం కాదు. తిన్న తర్వాత వెల్లకిలా పడుకోవటం మూలంగా ఛాతీలో మంట, గొంతులోకి ఆమ్లం ఎగదన్నుకు రావటం వంటి సమస్యలూ తలెత్తుతాయి. ఇవీ నిద్రకు ఆటంకం కలిగిస్తాయి.

కాబట్టి రాత్రిపూట కడుపు కాస్త ఖాళీగా ఉంచుకోవటం మంచిది. అలాగే తిన్న వెంటనే పడుకోకుండా చూసుకోవాలి. రెండు, మూడు గంటలైనా వ్యవధి ఇవ్వాలి. కాస్త అటూఇటూ తిరగాలి. వీలైనంత వరకూ రాత్రి 8 గంటలలోపు భోజనం చేస్తే మంచిది. తిన్నది కాస్త జీర్ణం అయ్యాక పడుకుంటే నిద్ర బాగా పడుతుంది.

# ఆయుష్షు మూలం మనసులోనే

దీర్ఘాయువు రహస్యం మనసులోనే దాగుందా? 115 ఏళ్ల వయసుతో ప్రపంచంలోనే అతి ఎక్కువకాలం జీవించి ఉన్న మహిళగా రికార్డు సృష్టించిన ఎథెల్ కేటర్‌హ్యామ్ ఇదే సూచిస్తున్నారు. వాదించక పోవటం.. ఎదుటివారు చెప్పింది విన్నా నచ్చింది చేయటమే తన దీర్ఘాయువు సూత్రమన్నది ఆమె నమ్మకం. ఇది మామూలు విషయంగా అనిపించినా ఇందులో ప్రశాంతత, ఆత్మ గౌరవం ధ్వనిస్తుండటం గమనార్హం. భావోద్వేగాల అదుపుతోనే ఇది సాధ్యం. దీనికీ దీర్ఘాయుష్షుకూ సంబంధం ఉంటుండటం మరింత విశేషం.

శారీరకంగా జబ్బులు లేకపోవటమే కాదు. మానసికంగానూ బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు. అప్పుడే చురుకుగా, హాయిగా జీవితాన్ని ఆస్వాదించగలం. కుటుంబ, సామాజిక సంబంధాలతో ఉన్నతిని సాధించగలం. ఇక్కడే భావోద్వేగాలను అదుపులో పెట్టుకునే నైపుణ్యం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. రోజూ మనకు ఎన్నో భావాలు కలుగుతుంటాయి. అవి అంతటితోనే ఆగిపోవు. ఉద్వేగాలనూ కలిగిస్తాయి. అన్నిసార్లూ ఇవి సానుకూలంగానే ఉండకపోవచ్చు. ప్రతికూల భావోద్వేగాలూ మనసును అతలాకుతలం చేస్తుండొచ్చు. ఉదాహరణకు– పరీక్షలో ఫెయిల్ అయ్యారనుకోండి. లేదూ కోరుకున్న ఉద్యోగం దొరకలేదనుకోండి. మనసంతా విచారంతో నిండిపోతుంది. కొందరు దీన్ని తేలికగా తీసుకోవచ్చు. అంతటితోనే ముగింపు పలకొచ్చు. కొందరు విపరీతంగా స్పందించొచ్చు. నిరాశా నిస్పృహలకు లోనుకావొచ్చు. ఇలాంటి ప్రతికూల భావాలను, వీటికి స్పందించే తీరును సమన్వయం చేసుకోవటమే భావోద్వేగ నైపుణ్యం. అంటే భావాలను అర్థం చేసుకొని, వాటిని సమర్థంగా అదుపులో ఉంచుకోవటమన్నమాట. స్వీయ చైతన్యం కలిగుండటం, జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కొనే సామర్థ్యమూ దీనిలోని భాగమే. ఇది మానసిక ఆరోగ్యం మీదే కాదు, శారీరక ఆరోగ్యం మీదా ప్రభావం చూపుతుంది.

**ఆయుర్దాయానికి దన్ను ఇలా..**

మనం ఆయుష్షును చాలావరకూ శారీరక ఆరోగ్యంతోనే ముడిపెట్టి చూస్తుంటాం. కానీ మానసిక ఆరోగ్యమూ గణనీయ పాత్ర పోషిస్తుంది. మానసికంగా బాగున్నవారు మరింత ఎక్కువ కాలం.. హాయిగా జీవించే అవకాశమున్నట్టు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఇందులో భావోద్వేగాలను అదుపులో పెట్టుకునే నైపుణ్యం అడుగడుగునా సాయం చేస్తుంది. ఇంతకీ ఇదెలా ఆయుష్షును పెంచుతుంది?

**ఒత్తిడి దూరం:** భావోద్వేగాల అదుపుతో కార్టిజోల్ వంటి ఒత్తిడి హార్మోన్ల మోతాదులు, ప్రభావాలు తగ్గుతాయి. ఫలితంగా కుంగుబాటు, ఆందోళన, భయాల వంటివీ తగ్గుముఖం పడతాయి. ఇది గుండె, మెదడు వంటి కీలక అవయవాలకూ మేలు చేస్తుంది. తరచూ కుంగుబాటు వంటి వాటికి గురయ్యేవారికి గుండెపోటు, పక్షవాతం ముప్పులు 6 రెట్లు ఎక్కువ. భావోద్వేగాల అదుపుతో వీటి ముప్పు తగ్గుతుంది. పరోక్షంగా ఆయుర్దాయమూ పెరుగుతుంది.

**రోగనిరోధక బలం:** మానసిక దృఢత్వంతో రోగనిరోధక వ్యవస్థ కూడా మెరుగవుతుంది. వీరిలో యాంటీబాడీలను తయారుచేసే టి కణాల వంటివి చురుకుగా పనిచేస్తాయి. అందువల్ల బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల ముప్పు తక్కువ. ఇన్‌ఫెక్షన్లు దాడిచేసినా సమర్థంగా ఎదుర్కోగలుగుతారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నవారు జబ్బుల



నుంచి 1.14 రెట్లు ఎక్కువ వేగంగా కోలుకుంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

**వాపు ప్రక్రియ తగ్గుముఖం:** కణ అంతర్గత వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తగ్గటం మరో ముఖ్య విషయం. దీంతో మధుమేహం, అల్జీమర్స్, క్యాన్సర్ల వంటి జబ్బులు వచ్చే అవకాశమూ తగ్గుతుంది.

**జీవనశైలి:** మానసికంగా బాగున్నవారు వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం తినటం వంటి మంచి జీవనశైలిని పాటిస్తుంటారు. ఇది మొత్తంగా ఆరోగ్యాన్నీ మెరుగు పరుస్తుంది.

**సర్దుబాటు సామర్థ్యం:** భావోద్వేగ నైపుణ్యం మూలంగా ఇతరులతో సర్దుకుపోయే స్వభావమూ మెరుగవుతుంది. దీంతో ఇంటా బయటా కలివిడితనం ఇనుమడిస్తుంది. కుటుంబ, స్నేహ సంబంధాలూ పెరుగుతాయి. ఉద్యోగ, వృత్తి, వ్యాపారాల్లో రాణించటంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తారు. ఇవి మరింత మానసిక దృఢత్వానికీ తోడ్పడతాయి. ఇలా ఇదొక సానుకూల వలయంగా ప్రయోజనం కలిగిస్తుందన్నమాట.

**భావోద్వేగ నైపుణ్యాన్ని సాధించేదెలా?**

**అవగాహన:** భావోద్వేగాలను గుర్తించటం, అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం. అప్పుడే వీటిని అదుపులో ఉంచుకోవటానికి, పైచేయి సాధించటానికి మార్గం సుగమమవుతుంది. ఉదాహరణకు– ఇంతకుముందు ఎవరి మీదైనా కోపాన్ని ప్రదర్శించినప్పుడు ఎలాంటి అనుభవం ఎదురైంది? వాళ్లు ఎలా బాధపడ్డారు? తమకు ఎంత క్షోభ కలిగింది? అనేవి అవగతమైతే ముందుముందు భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవటానికి వీలుంటుంది.

**దయ, కరుణ:** మన చేతుల్లో లేనివాటికి చింతిస్తే ప్రయోజనం లేదు. దీంతో భావోద్వేగాలు అదుపు తప్పుతాయి. కాబట్టి తమను తాము దయతో చూసుకోవటం, బలాలు, బలహీనతలను గుర్తించటం.. తమను తాము క్షమించుకోవటం సాధన చేయాలి.

**అన్యోన్య అనుబంధాలు:** ఇవి ఒడుదొడుకుల్లో తమకు ఒకరు తోడున్నారనే భరోసా ఇస్తాయి. ధైర్యంగా ముందుకు సాగేలా ప్రోత్సహిస్తాయి. మానసిక సమతుల్యత చేకూరుస్తాయి. భావోద్వేగాలను నియంత్రించుకునే సామర్థ్యమూ అబ్బుతుంది.

**లక్ష్య సాధన:** జీవితంలో ఏదో ఒక ఆశయం, లక్ష్యం పెట్టుకోవటం.. దాన్ని సాధించటానికి ప్రయత్నిస్తుంటే తృప్తి కలుగుతుంది. పెద్ద పెద్ద లక్ష్యాలే కానక్కర్లేదు. చిన్నవైనా సరే. వీటిని క్రమంగా సాధిస్తుంటే ఆత్మ విశ్వాసం, నిబ్బరం ఇనుమడిస్తాయి.

**ధ్యానం:** గాఢంగా, లయబద్ధంగా శ్వాస తీసుకుంటూ చేసే ప్రాణాయామం, మనసు మీద దృష్టిని నిలిపే ధ్యానం ఎంతో మేలు చేస్తాయి. ఇవి ప్రతికూల ఆలోచనల నుంచి మనసును మళ్లించి సానుకూల భావాలు పెంపొందేలా చేస్తాయి.

**డైరీ రాయటం:** తాము ఎదుర్కొన్న ఘటనలను డైరీలో రాసుకుంటే ఎప్పుడెలా ప్రవర్తించామో అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. అసమంజసంగా స్పందించటాన్ని తెలుసుకోవటానికి, ముందుముందు అలా ప్రవర్తించకుండా ఉండటానికి దోహదం చేస్తుంది.

**సృజనాత్మక కళలు:** సంగీతం, చిత్ర లేఖనం, చేత్తో బొమ్మలు చేయటం వంటి సృజనాత్మక కళలు మనసులోని భావాలను బయటకు వెల్లడించటానికి, భారం తగ్గటానికి తోడ్పడతాయి. ప్రతికూల భావోద్వేగాలు క్రమంగా సానుకూలంగా మారతాయి.

**సమయ పాలన:** పనులను ఆయా వేళల ప్రకారం చేయటం, సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవటం మరో మంచి పద్ధతి. ఇది అనవసరంగా ఆదుర్దా పడకుండా, భావోద్వేగాలు గతి తప్పకుండా చూసుకోవటానికి తోడ్పడుతుంది.

**ఓపెన్ మైండ్:** అవతలివారి కోణాన్ని వినటం వల్ల అభిప్రాయ భేదాలను గుర్తించటానికి వీలవుతుంది. భావోద్వేగాలు అదుపు తప్పకుండా చూసుకోవచ్చు. ఎదుటి వ్యక్తికి కనీస గౌరవం ఇవ్వటం ద్వారా వ్యక్తిగత దూషణలకు దిగకుండా చూసుకోవచ్చు.



# ఊపిరితిత్తి క్యాన్సర్‌తో జాగ్రత్త

మనదేశంలో మొత్తం క్యాన్సర్లలో అత్యధికంగా ఆరోగ్యకర సంవత్సరాలను కోల్పోయేలా చేస్తున్నది ఊపిరితిత్తి క్యాన్సరే. ఏటా లక్షలాది మంది మరణాలకు దారితీస్తోంది. దీనికి ప్రధాన కారణం 75% నుంచి 85% మందిలో బాగా ముదిరిన తర్వాతే క్యాన్సర్ బయటపడుతుండటం. పాశ్చాత్యదేశాలతో పోలిస్తే మనదగ్గర పదేళ్ల ముందుగానే ఇది దాడి చేస్తుండటం గమనార్హం. చాలామంది 50ల్లోనే దీని బారినపడుతున్నారు. మంచి విషయం ఏంటంటే– ఎన్నో కేసులను నివారించుకునే వీలుండటం.

**జాగ్రత్త ఇలా..**

ఊపిరితిత్తి క్యాన్సర్ నివారణకు అత్యంత సమర్థమైన మార్గం పొగ తాగకుండా చూసుకోవటం. అప్పటికే అలవాటుంటే మానెయ్యటం. దీన్ని మానెయ్యటానికి అవసరమైతే వైద్యుల సాయం తీసుకోవాలి. ఇతరులు కాల్చే సిగరెట్లు, చుట్టలు, బీడీల పొగను పీల్చకుండా ఉండటమూ ముఖ్యమే.

ఆస్‌బెస్టాస్, ఇంటా బయటా గాలి కాలుష్యం, రాడాన్, ఆర్సెనిక్, కొన్నిరకాల రసాయనాలూ క్యాన్సర్ కారకాలుగా పరిణమించొచ్చు. అందువల్ల వీలైనంతవరకూ వీటి ప్రభావం పడకుండా చూసుకోవాలి.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి.

ఊపిరితిత్తి క్యాన్సర్‌ను త్వరగా గుర్తించటం చాలా కీలకం. ఎందుకంటే తొలిదశలో ఎలాంటి లక్షణాలూ ఉండవు. కాబట్టి ముప్పు ఎక్కువగా గలవారు డాక్టర్‌తో చర్చించి, తక్కువ మోతాదు సీటీ (ఎల్‌డీసీటీ) పరీక్ష చేయించుకోవటం మంచిది. సాధారణంగా ప్రస్తుతం అతిగా పొగ తాగుతున్న లేదా ఒకప్పుడు తాగే అలవాటు గల 40 నుంచి 80 ఏళ్ల వారికి దీన్ని సూచిస్తుంటారు.

విడవకుండా దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడటం, అకారణంగా బరువు తగ్గటం, ఛాతీ నొప్పి, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. త్వరగా గుర్తిస్తే చికిత్స ఫలితాలు బాగుంటాయి.

# 2027 ప్రపంచకప్‌కు పాండ్యా కీలకం.. ఫిట్‌గా ఉంచడమే అసలు సవాల్: గంగూలీ

**నితీశ్ రెడ్డి ప్రత్యామ్నాయంగా ఉండొచ్చన్న గంగూలీ**

**జడేజా కూడా మరో ఆప్షన్ అన్న మాజీ కెప్టెన్**

**సీమింగ్ ఆల్‌రౌండర్ అవసరమన్న గంగూలీ**

**తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో ఆడడం మంచిదేనని వ్యాఖ్య**

**దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని వెల్లడి**



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలకమని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. అతడిని పూర్తిగా ఫిట్‌గా ఉంచి, ప్రపంచకప్‌కు సిద్ధం చేయడం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ముందున్న ప్రధాన సవాల్ అని పేర్కొన్నాడు.2027 ప్రపంచకప్ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనుంది. పాండ్యా ఇప్పటికే 2019, 2023 ప్రపంచకప్‌ల్లో భారత్ తరఫున ఆడాడు. 2023లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా చీలమండ గాయం కావడంతో టోర్నీకి దూరమయ్యాడు."ప్రపంచకప్‌లో భారత జట్టు సమతూకానికి హార్దిక్ చాలా ముఖ్యం. అతడిని మైదానంలో ఫిట్‌గా ఉంచడం గంభీర్, టీమ్ ముందున్న పెద్ద సవాల్. అతడు తగినంత క్రికెట్ ఆడటం లేదు. ఒకవేళ హార్దిక్ అందుబాటులో లేకపోతే నితీశ్ రెడ్డి తర్వాతి ప్రత్యామ్నాయం. కానీ నితీశ్‌ను హార్దిక్‌కు ప్రత్యామ్నాయంగా చూడాలంటే అప్పటివరకు అతడు వరుసగా క్రికెట్ ఆడాలి" అని గంగూలీ జియోస్టార్‌తో అన్నాడు.రవీంద్ర జడేజా కూడా మరో ప్రత్యామ్నాయమని గంగూలీ పేర్కొన్నాడు. అయితే దక్షిణాఫ్రికాలో అక్టోబర్‌లో జరిగే ప్రపంచకప్‌లో సీమింగ్ ఆల్‌రౌండర్ అవసరం ఉంటుందని వివరించాడు. భారత టాప్-5 బ్యాటర్లలో ఎవరూ బౌలింగ్ చేయకపోవడంతో ఐదు లేదా ఆరో బౌలింగ్ ఆప్షన్‌ను ఎక్కడి నుంచో తీసుకురావాల్సి ఉంటుందని చెప్పాడు.భారత్ తన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో ఆడనుండటంపైనా గంగూలీ స్పందించాడు. తొలి మ్యాచ్‌లోనే బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవడం మంచిదేనన్నాడు. రెండో దశలో దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్ కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పాడు. సొంత గడ్డపై జరిగే ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా బలమైన జట్టుతో వస్తుందని పేర్కొన్నాడు.మాజీ వికెట్‌కీపర్ పార్థివ్ పటేల్ కూడా షెడ్యూల్‌పై స్పందించాడు. ఆరంభంలోనే రెండు కఠినమైన మ్యాచ్‌లు ఆడటం ద్వారా జట్టు కాంబినేషన్‌ను పరీక్షించుకోవచ్చని, కీలక ఆటగాళ్ల ఫిట్‌నెస్, ఫామ్, వర్క్‌లోడ్‌ను అవసరానికి తగ్గట్టు నిర్వహించవచ్చని చెప్పాడు.

# ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం.. 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్

- **ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం**
- **ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం**
- **2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి.అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు.భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

# 30 నిమిషాల్లోనే మూడు గోల్డ్ మెడల్స్.. ఆసియా క్రీడల్లో దుమ్మురేపిన భారత బాక్సర్లు, రెజ్లర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** జపాన్ వేదికగా జరుగుతోన్న 2026 ఆసియా క్రీడల్లో భారత రెజ్లర్లు, బాక్సర్లు దుమ్మురేపుతున్నారు. రెజ్లింగ్, బాక్సింగ్ విభాగాల్లో శుక్రవారం (అక్టోబర్ 2) 30 నిమిషాల వ్యవధిలోనే భారత్?కు? మూడు స్వర్ణ పతకాలు లభించాయి. బాక్సింగ్‌లో అంకుష్, పర్వీన్, రెజ్లింగ్‌లో సుజీత్ కల్కల్ ముగ్గురు గోల్డ్ మెడల్స్ సాధించారు. దీంతో ఆసియా క్రీడల్లో భారత్ స్వర్ణ పతకాల సంఖ్య 15కు చేరింది. ఓవరాల్?గా 75 పతకాలతో పాయింట్ల పట్టికలో ఇండియా స్థానానికి చేరుకుంది.

**అంకుష్ , పర్వీన్ పసిడి పంచ్**

2026 ఆసియా క్రీడల్లో భారత బాక్సర్లు అంకుష్ పంఘల్, పర్వీన్ హూడా పసిడి పంచ్ విసిరారు. శుక్రవారం (అక్టోబర్ 2) జరిగిన ఫైనల్స్?లో అద్భుతమైన ప్రదర్శనతో ఇద్దరు గోల్డ్ మెడల్స్ సాధించారు. మహిళల 65 కేజీల విభాగంలో చైనీస్ తైపీకి చెందిన చెన్ నిన్ చెన్‌పై పర్వీన్ హూడా థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. ప్రత్యర్థిపై పంచుల వర్షం కురిపించిన పర్వీన్ 3-2 తేడా పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

తద్వారా ఆసియా క్రీడల చరిత్రలో బాక్సింగ్ విభాగంలో స్వర్ణం సాధించిన మూడో భారతీయ మహిళా అథ్లెట్‌గా పర్వీన్ రికార్డ్ సృష్టించింది. పురుషుల 85 కేజీల విభాగంలో పోటీపడ్డ భారత బాక్సర్ అంకుష్ పంఘల్ పసిడి పతకం సాధించాడు. ఫైనల్స్?లో కొరియా బాక్సర్ ను చిత్తుచిత్తుగా ఓడించాడు. 4-0 తేడాతో ఫైనల్ ను ఏకపక్షం చేసి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

**సుజీత్ కల్కల్ పసిడి పట్టు**

ఆసియా క్రీడల్లో భారత యువ రెజ్లర్ సుజీత్ కల్కల్ చారిత్రాత్మక విజయం సాధించాడు. వీరోచిత పోరాటంతో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. పురుషుల ఫ్రీస్టైల్ 65 కేజీల ఫైనల్స్?లో తజికిస్తాన్‌కు చెందిన అబ్దుల్‌మహ్‌జిద్ కుదీవ్?తో సుజీత్ పోటీపడ్డాడు. ఈ ఫైనల్ పోరు చివరి వరకు హోరాహోరీగా సాగింది. ఒక దశలో 2-9 పాయింట్లతో వెనుకబడ్డాడు. దీంతో భారత్ రెజ్లర్ ఓటమి ఖాయం అనుకున్నారు అంతా. కానీ సుజీత్ మాత్రం నిరాశ పడలేదు. ధైర్యంగా పోరాటం కొనసాగించాడు. సెకండ్ రౌండ్‌లో చెలరేగి ఆడుతూ వరుసగా 8 పాయింట్లు సాధించి 10-9 తేడాతో థ్రిల్లింగ్ విజయాన్ని అందుకుని పసిడి పతకాన్ని సాధించాడు. ప్రస్తుత ఆసియా క్రీడల్లో రెజ్లింగ్ విభాగంలో భారత్‌కు ఇదే తొలి స్వర్ణ పతకం కావడం విశేషం.

# మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ తో డ్రాగన్ ఎక్కడికో!







యంగ్ టైగర్ ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం -డ్రాగన్- పై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు. ప్రశాంత్ నీల్ సినిమాలంటేనే విజువల్ వండర్స్, ఎమోషనల్ డెప్త్, గూస్ బంప్స్ తెప్పించే యాక్షన్ ఎపిసోడ్స్ అదిరిపోతాయి. తాజాగా -డ్రాగన్- విషయంలో నీల్ అంతకంటే రెట్టింపు స్థాయిలో యాక్షన్ ప్లాన్ చేసినట్లు వినిపిస్తోంది.ఈ సినిమా కేవలం యాక్షన్ ఎంటర్‌టైనర్‌లా కాకుండా హాలీవుడ్ స్థాయి సాంకేతిక విలువలతో విజువల్ విందుగా మలచడానికి నీల్ అండ్ టీమ్ అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రత్యేకంగా డిజైన్ చేసిన మూడు ప్రధాన యాక్షన్ బ్లాక్స్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయట. జైలు నేపథ్యంతో వచ్చే జైల్ పార్కర్ ఫైట్, అత్యంత ఉత్కంఠభరితంగా సాగే 'జిటిసి కాళీమాత దగ్గర వచ్చే ఫైట్', రోమాలు నిక్కబొడుచుకునేలా చేసే 'బ్లడ్ ఫైట్ ఎపిసోడ్స్' ప్రేక్షకులకు అసలైన సినిమాటిక్ కిక్‌ను ఇవ్వబోతున్నాయంటున్నారు. ఇది సాధారణ ఫైట్లలా కాకుండా ప్రతి యాక్షన్ సీక్వెన్స్‌కు బలమైన భావోద్వేగ నేపథ్యం ఉండేలా ప్రశాంత్ నీల్ సీన్స్ సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఈ మూడు భారీ యాక్షన్ బ్లాక్‌లు సినిమా రన్‌టైమ్‌లో కీలక మలుపులుగా నిలుస్తాయట. కథను పరుగులు పెట్టించడంలో కీలక పాత్ర పోషిస్తాయని సమాచారం.సినిమాలో వచ్చే మొదటి ప్రధాన యాక్షన్ బ్లాక్ అయిన జైల్ పార్కర్ ఫైట్ గురించి ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. అత్యంత క్లిష్టమైన సెట్టింగుల మధ్య, భారీ హంగులతో తెరకెక్కించిన ఈ ఫైట్ సీక్వెన్స్ సినిమాలో హైలైట్‌గా నిలవనుంది. ఎన్టీఆర్ స్క్రీన్ ప్రెజెన్స్, ఆయన బాడీ లాంగ్వేజ్‌కు తగినట్లుగా ప్రశాంత్ నీల్ ఈ ఫైట్‌ను అత్యంత సహజంగా డిజైన్ చేశారట. ఈ ఎపిసోడ్‌లో ఎన్టీఆర్ చూపించే ఇంటెన్సిటీ, యాక్షన్ కొరియోగ్రఫీ ప్రేక్షకులను సీట్లలో కదలకుండా కట్టిపడేయడం ఖాయమని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి.ఇక రెండో కీలక ఘట్టమైన -జిటిసి కాళీమాత దగ్గర వచ్చే ఫైట్- ఈ చిత్రంలోనే అత్యంత శక్తివంతమైన ఎపిసోడ్‌గా నిలవబోతోందిట. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ సృష్టించిన మ్యాజిక్ కలగలిపి ఈ ఫైట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లనున్నాయంటున్నారు. కాళీమాత ప్రాంగణం నేపథ్యంలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ మాస్ అండ్ రౌద్ర రూపం ప్రేక్షకులకు పూనకాలు తెప్పించడం పక్కా అంటున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, కెమెరా యాంగిల్స్ ఈ ఫైట్‌ను మరో స్థాయికి చేర్చనున్నాయి. థియేటర్లలో ఈ సీన్ వచ్చే సమయంలో ఫ్యాన్స్ ఇచ్చే రెస్పాన్స్ ఊహకందనట్లు ఉంటుందంటున్నారు.ఈ చిత్రంలోని మూడు ప్రధాన యాక్షన్ బ్లాక్స్‌లో అత్యంత క్రూరమైన, భావోద్వేగంతో కూడినదిగా చెబుతున్న -బ్లడ్ ఫైట్ ఎపిసోడ్- సినిమాకే అసలైన హైలైట్‌గా నిలవనుంది. కథను క్లైమాక్స్ మలుపు వైపు తిప్పే ఈ ఘట్టంలో యాక్షన్ పోరాటంలా కాకుండా ఒక సర్వైవల్ వార్ లా సాగుతుందిట. ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో రక్తపుటేరులు పారేలా ప్రతి ఫ్రేమ్‌లోనూ ఇంటెన్సిటీ మిస్ కాకుండా ఎపిసోడ్‌ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ నటన ఈ ఫైట్‌కు ప్రాణం పోస్తుందని, వెండితెరపై ఈ విజువల్ వండర్ చూస్తున్నప్పుడు ప్రేక్షకులు మైమరచిపోవడం ఖాయమనే మాట బలంగా వినిపిస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965